TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867

# తెలంగాణ శాసనసభ

ఎడిటర్ పి. రాజేష్

తెలుగు దినపత్రిక

Published from Hyderabad, Rangareddy, Nalgonda, Mahabubnagar, Khammam | సంపుటి : 2 | సంచిక : 80 | పేజీలు : 8 | సోమవారం 19 ఆగస్టు 2024 | వెల : 4/-

**రిపోర్టర్లు కావలెను...**

తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ శాసనసభ తెలుగు దినపత్రికకు రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తిగల, అనుభవం కలిగిన అభ్యర్దులు కావలెను..

తెలంగాణ శాసనసభ తెలుగు దినపత్రిక నెట్వర్క్ ఇంచార్జ్
పి.వెంకటేష్
9949360937,9100900931

## ప్రజలకు చేరువగా సర్కారు



- రేవంత్‌రెడ్డి 250 రోజుల పాలనపై సర్వే
- రాష్ట్రవ్యాప్తంగా 20 జిల్లాల్లో ప్రజల అభిప్రాయాలను సేకరించిన ఆ సంస్థ
- 72 శాతం మంది ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు
- మెజారిటీ ప్రజలు కాంగ్రెస్ పార్టీ పాలనపై సానుకూలంగా స్పందించారు
- ప్రధానంగా కలిసోచ్చిన్న మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం

హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎ.రేవంత్ రెడ్డి తన పాలనకు 250 రోజులు పూర్తిచేసుకున్నారు. ఐదు సంవత్సరాల పరిపాలనా కాలంలో 250 రోజులు అంటే తక్కువ సమయమే అయినప్పటికీ కొన్ని సంక్షేమ పథకాలను అమలు చేయడం, మరికొన్ని పథకాల అమలు నెమ్మదిగా జరుగుతుండటంతో ప్రజలు ఏమనుకుంటున్నారు? ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పనితీరు ఎలా ఉంది? అనే అంశాలపై తెలంగాణలో ఓ సంస్థ సర్వే చేపట్టింది. - మిగతా3లో

## రాష్ట్రంలో ఐదురోజులు వర్షాలే!

- ఎల్లో అలర్ట్ జారీ చేసిన వాతావరణ కేంద్రం
- ఉత్తర ఇంటీరియర్ కర్ణాటకను ఆనుకొని ఉన్న తెలంగాణ మీదుగా కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
- ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వానలు కురిసే అవకాశం



## కాళేశ్వరంపై విచారణ వేగవంతం



- 2 వారాల పాటు విచారణ
- జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలో కమిషన్
- ఇప్పటికే, కాళేశ్వరంలోని వివిధ బ్యారేజీలను స్వయంగా పరిశీలించిన కమిషన్
- విచారణలో భాగంగా అధికారులు, ఇంజినీర్లు, ప్రైవేట్ వ్యక్తులకు సమన్లు జారీ

హైదరాబాద్

ఏం చేసినా ఈ నెలాఖరులోపే. కాళేశ్వరంలో అవినీతిపై అనుమానం వచ్చిన ప్రతి ఒక్కరినీ పిలిపించడానికి.. మిగిలింది ఇంకో రెండు వారాలే. బహుశా ఈ వారంలో కొన్ని సంచలనాలు కూడా ఉంటాయంటున్నారు. కీలక వ్యక్తులతో పాటు - మిగతా3లో

## తూతూమంత్రంగా రుణమాఫీ



- రుణమాఫీతో రైతులను నట్టేట ముంచింది
- రైతులందరికీ రుణమాఫీ చేయకుంటే కాంగ్రెస్‌పై పోరాడతాం..
- రాహుల్, ఖర్గేకు కేటీఆర్ లేఖ
- కనీసం 40 శాతం కూడా రుణమాఫీ పూర్తిచేయకుండానే వందశాతం రుణమాఫీ పూర్తయిపోయిందని ప్రకటించడం వందకు వందశాతం అబద్ధం
- మీరు ఇచ్చిన హామీని నిలబెట్టుకుని రైతులందరికీ రుణమాఫీ చేయాలి

హైదరాబాద్

తెలంగాణలో రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ పార్టీ చేసిన మోసంపై రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేఖ రాశారు. రాష్ట్రంలో రుణమాఫీ అందని లక్షలాది మంది రైతుల తరఫున ఈ లేఖ రాస్తున్నానని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన అబద్ధాలు, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలకు మధ్య ఉన్న స్పష్టమైన తేడాను ఆ లేఖలో పొందుపరిచారు. వరంగల్ రైతు డిక్లరేషన్ పేరిట రైతులకు రెండు లక్షల రుణమాఫీ హామీ ఇచ్చారు.. కానీ ఈ ప్రభుత్వం - మిగతా3లో

## ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- వ్యాను, బస్సు ఢీ.. పదిమంది దుర్మరణం
- మరో 27 మందికి తీవ్ర గాయాలు
- మృతులంతా అలీగఢ్ జిల్లాకు చెందిన కార్మికులు



## అన్నారుగూడెంలో 9మంది రైతు కూలీలకు అస్వస్థత

- మందు చల్లే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం, వేసవిని తలపిస్తున్న ఎండలకు కూలీలంతా అస్వస్థత
- బాధితులను పరీక్షించిన చికిత్స అందించిన వైద్యులు
- ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు కల్లూరు వైద్యులు వెల్లడి

## త్వరలోనే రైతులందరికీ రుణమాఫీ

- రాష్ట్ర రాజధానిలో జరిగిన పలు సమీక్షల్లో పరకాల అభివృద్ధిపై చర్చించాం
- టెక్స్‌టైల్ పార్కును దేశంలోనే రోల్ మోడల్ పార్కుగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ ఆలోచనలో ఉంది
- గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూమి కోల్పోయిన రైతులకు మంచి ధర చెల్లించి అండగా ఉంటాం
- రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



వరంగల్

రాష్ట్రవ్యాప్తంగా రైతు రుణమాఫీకి రూ.19వేల కోట్ల నిధులు మంజూరు చేశామని, మరో రూ.12వేల కోట్లు త్వరలోనే మంజూరు చేసి త్వరలోనే రైతులందరికీ రుణమాఫీని పూర్తి చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ - మిగతా3లో



## రేపు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపు

- ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను విచారించేందుకు కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గ్లహెూత్ అనుమతి
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే ఈ ఆందోళన కార్యక్రమం శాంతియుతంగా జరగాలి
- ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకూడదు
- పార్టీ శ్రేణులకు డిప్యూటీ సీఎం, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ సూచన

## బీఆర్ఎస్ అవుట్ డేటెడ్ పార్టీ

- బీజేపీలో బీఆర్ఎస్ విలీనంపై బండి సంజయ్ హాట్ కామెంట్స్..
- కేసీఆర్, కేటీఆర్ పేరెత్తితేనే జనం రాళ్లతో కొట్టే పరిస్థితి ఉంది
- ఆ పార్టీ ఎమ్మెల్యేల అవసరం కాంగ్రెస్‌కే ఉంది
- అవినీతి పార్టీ బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోవాల్సిన ఖర్మ బీజేపీకి లేదు
- రుణమాఫీ సహా 6 గ్యారంటీలపై చర్చను పక్కదారి పట్టించేందుకే ఈ విలీన డ్రామాలు



హైదరాబాద్

బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతుందంటూ వస్తున్న వార్తలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. ఈ వ్యవహారంపై హాట్ హాట్ కామెంట్స్ చేశారు. విలీనం, పొత్తులు గంగలో కలవనీయండని అన్నారు. వాటితో ప్రజలకేం సంబంధం? అని అన్నారు. ఇదే అంశంపై ఇటీవల విపరీతమైన ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆదివారం నాడు మీడియాతో మాట్లాడారు కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్. బీఆర్ఎస్‌పై, ఆ పార్టీ అగ్ర నేతలపై షాకింగ్ కామెంట్స్ చేశారు. కేసీఆర్, కేటీఆర్ పేరెత్తితేనే జనం రాళ్లతో కొట్టే పరిస్థితి ఉందన్నారు. బీఆర్ఎస్ అవుట్ - మిగతా3లో

# మీకిది తగునా?




**కోల్ కతా:** కోల్ కతా ట్రైనీ డాక్టర్ మృతిపై ఆందోళనలు మిన్నంటాయి. వైద్యురాలి పేరంట్స్ మీడియా ముందుకు వచ్చారు. పశ్చిమ బెంగాల్ సర్కార్ తీరును తప్పు పట్టారు. సీఎం మమతా బెనర్జీ (%మీఖుఎఝ్ఖు దీఖుఅవతీయవవ%) ద్వంద్వ వైఖరి అవలంభిస్తున్నారని విరుచుకుపడ్డారు. తమ బిడ్డ మృతికి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

**బానే మాట్లాడారు.. కానీ..?**

'నా బిడ్డ చనిపోవడంతో బెంగాల్ సీఎం మమతా బెనర్జీ వీధుల్లోకి వచ్చి చాలా బాగా మాట్లాడారు. నా బిడ్డ మృతికి న్యాయం జరగాలని ఆందోళన కూడా చేపట్టారు. అదే సమయంలో ప్రజల ఆగ్రహాన్ని అణచి వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎందుకు ద్వంద్వ విధానం అమలు చేస్తున్నారు. ప్రజలను చూస్తే మీకు భయం వేస్తోందా..? ఇదే అంశంపై నాకు పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. వాటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత మీపై ఉంది. నా బిడ్డ చనిపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయి. న్యాయం కోసం అందరూ రోడ్లమీదకొచ్చారు. వారిని అడ్డుకునే ప్రయత్నంలో బెంగాల్ ప్రభుత్వం ఉంది. స్వేచ్ఛగా నిరసన చేస్తోన్న వారి గొంతును మమతా బెనర్జీ అడ్డుకుంటున్నారు. బెంగాల్ సీఎం రోడ్డుమీదకొస్తే ఇతరుల నిరసనలు చూసేందుకు ఇష్టపడటం లేదెమో అని' మృతురాలి తండ్రి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

**మీరు ఆలోచించండి..**

బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీరును బాధితురాలి తల్లి కూడా తప్పు పట్టారు. 'కన్యశ్రీ, లక్ష్మీభాండర్ పథకాలు పొందుతున్న వారికి నేను చెబుతున్నది ఒక్కటే. ఆ పథకాలు సరే.. మీ భద్రత సంగతి ఏంటీ..? అలాంటి పథకాలతో ప్రయోజనం పొందుతారే తప్ప ఏ మాత్రం భద్రత ఉండదు. నా కూతురిని హతమార్చిన వారిని కఠినంగా శిక్షించాలి. ఆ తర్వాత మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం అందజేసే పరిహారం తీసుకుంటాం అని' వైద్యురాలి తల్లి స్పష్టం చేశారు. కోల్ కతా ఆర్జీ కర్ ఆస్పత్రి సమీపంలో ఐదుగురు కంటే ఎక్కువ మంది సమావేశం కావొద్దని పోలీసులు స్పష్టం చేశారు. ఆ ఆదేశాలు అమల్లోకి వచ్చిన వెంటనే వైద్యురాలి తల్లి, తండ్రి మీడియాతో మాట్లాడారు. పశ్చి బెంగాల్ సర్కార్ అనుసరిస్తోన్న తీరును ఎండగట్టారు.

# నేడు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపు



**బెంగళూరు :** మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) కుంభకోణంలో ముఖ్యమంత్రి సిద్దరాయమ్యను విచారించేందుకు కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గ్లహెూత్ అనుమతి ఇవ్వడంపై అధికార కాంగ్రెస్ పార్టీ మండిపడ్డింది. ఆ క్రమంలో రేపు.. అంటే ఆగస్ట్ 19వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టాలని శ్రేణులకు ఆ పార్టీ పిలుపునిచ్చింది.

డిప్యూటీ సీఎం డీకే కీలక నిర్ణయం.. ఆదివారం బెంగళూరులో కర్ణాటక డిప్యూటీ సీఎం, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో అన్ని పార్టీల నేతలతోపాటు కార్యకర్తలు సైతం పాల్గొనాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే ఈ ఆందోళన కార్యక్రమం శాంతియుతంగా జరగాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు ఆయన సూచించారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకూడదన్నారు.

**పార్టీ శ్రేణులకు జాగ్రత్తలు చెప్పిన డిప్యూటీ సీఎం ..**

కాంగ్రెస్ పార్టీ చేపట్టే ఈ ఆందోళనల్లో సంఘ విద్రోహక శక్తులు చొరబడే అవకాశముందని ఈ సందర్భంగా డిప్యూటీ డీకే శివకుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా ఈ ఆందోళనల్లో హింసాకు దారి తీసే పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఈ ఆందోళనలు చాలా జాగ్రత్తగా చేపట్టాలని పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా ఆయన సూచించారు.

**రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వినతి పత్రాలు...**

సీఎం సిద్దరామయ్యను విచారించాలంటూ గవర్నర్ గేహ్లాత్ నిర్ణయానికి వ్యతిరేకంగా.. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వినతి పత్రాలు పంపాలన్నారు. అందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లా, తాలుకా కేంద్రాల్లోని ఉన్నతాధికారులకు అందుకు సంబంధించిన వినతి పత్రాలు అందజేయాలని పార్టీ శ్రేణులకు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సూచించారు.

**సీఎం కూర్చి దింపేందుకు కుట్ర..**

సీఎం సిద్దరామయ్యను పదవి నుంచి దిప్పేందుకు జరుగుతున్న ఈ కుట్రకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని డీ కే శివకుమార్ స్పష్టం చేశారు. సిద్దరామయ్య ప్రభుత్వానికి వ్యతికరంగా భాగస్వామ్య పక్షాలైన బీజేపీ, జేడీ(ఎస్)లు కుట్రపూరితంగా వ్యవహరిస్తు న్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం సిద్దరామయ్యను లక్ష్యంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వంలోని బీజేపీ, జేడీ(ఎస్)తో పాటు కర్ణాటకలోని స్థానిక నేతలు ఒక తాటికిపైకి వచ్చి కుట్రకు తెర తీశారని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఆరోపించారు.

## బ్యాంకు సమస్యల కారణంగానే అజిత్ పవార్‌తో ఉన్నా ఎన్సీపీ ఎమ్మెల్యే కీలక వ్యాఖ్యలు



ముంబై: మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవర్ వర్గానికి చెందిన ఎన్సీనీ ఎమ్మెల్యే కీలక వ్యాఖ్యలు చేశారు. తనకున్న బ్యాంకు సమస్యల కారణంగానే అజిత్ పవార్ వెంట ఉన్నట్లు తెలిపారు. అయితే శరద్ పవార్‌ను తాను ఎప్పుడూ గౌరవిస్తానని ఆయన అన్నారు. శనివారం వార్ధాలో జరిగిన కార్యక్రమంలో ఎన్సీపీ ఎమ్మెల్యే రాజేంద్ర షింగ్నే పాల్గొన్నారు. ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్‌తో కలిసి వేదికను పంచుకున్నారు. కాగా, ఎన్సీపీ ఎమ్మెల్యే రాజేంద్ర షింగ్నే ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. శరద్ పవార్‌ను తాను ఎప్పుడూ గౌరవిస్తానని ఆయన అన్నారు. 'నా జిల్లా సహకార బ్యాంకు (బుల్దానాలో) ఎదుర్కొంటున్న ఇబ్బందు లు, నిస్సహాయత కారణంగా నేను అజిత్ దాదా (అజిత్ పవార్)తో కలిసి ప్రభుత్వం వైపు వెళ్లాల్సి వచ్చింది. ఈ రోజు ప్రభుత్వం నుంచి జిల్లా సహకార బ్యాంకు రూ. 300 కోట్లు పొందింది. కానీ పవార్ సాహెబ్ (శరద్ పవార్) నాకు ఎల్లప్పుడూ గౌరవనీయులు' అని అన్నారు. మరోవైపు ఈ ఏడాది చివర్లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నా యి. లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్ష ఎంవీఏ కూటమి విజయంతో ఎన్సీపీ నేతలు ఇప్పటికే శరద్ పవర్ శిబిరంలో చేరుతున్నారు. అజిత్ పవార్ వెంట ఉన్న మరికొందరు ఎమ్మెల్యేలు, ఎంపీలు బహిరంగంగానే శరద్ పవార్‌కు మద్దతిస్తున్నారు.

# రాజ్యాంగంపె దాడి



ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మోదీ రాజ్యాంగంపై, రాజ్యాంగ వ్యవస్థలపై దాడి చేస్తున్నారని అన్నారు. ఉన్నత ఉద్యోగాల్లో లేటరల్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను బహిరంగంగానే లాక్కుంటున్నారని రాహుల్ గాంధీ విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగా నియామకం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ద్వారా కాకుండా.. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ద్వారా జరుగుతోందని ఆరోపించారు. అత్యున్నత బ్యూరోక్రసీ వ్యవస్థతో పాటు దేశంలోని అన్ని అత్యున్నత స్థానాల్లో అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యం లేదని తాను ఎప్పటినుంచో చెబుతూ వస్తున్నానని, ఆ వ్యవస్థను మెరుగుపరచడానికి బదులు, లేటరల్ ఎంట్రీ ద్వారా అణగారిన వర్గాలకు అత్యున్నత స్థానాల్లో చోటులేకుండా చేస్తున్నారని రాహుల్ గాంధీ విమర్శించారు. కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన లేటరల్ విధానం యుపిఎస్‌సికి సిద్ధమవుతున్న ప్రతిభావంతులైన ఎంతోమంది యువత హక్కులను దోచుకునేలా ఉందన్నారు. ఈ విధానాన్ని అణగారిన వర్గాలకు చెందాల్సిన రిజర్వేషన్లను లాక్కోవడంతో పాటు సామాజిక న్యాయంపై దాడిగా రాహుల్ పేర్కొన్నారు.

ఆ విధానానికి వ్యతిరేకం-రాహుల్ గాంధీ

లేటరల్ విధానం ద్వారా కేంద్రప్రభుత్వం ఐఏఎస్‌లను ప్రైవేటీకరిస్తుందని ఆరోపించారు. రిజర్వేషన్లను అంతం చేయడానికి ఇది మోదీ ఇచ్చిన హామీగా పేర్కొన్నారు. కీలకమైన ప్రభుత్వ పదవుల్లో బయట వ్యక్తులను కూర్చోబెట్టడం ద్వారా కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు ఎలాంటి దోపిడీ చేస్తారో చెప్పడానికి సెబీ ఉదాహరణ అని రాహుల్ గాంధీ తెలిపారు. ప్రయివేట్ రంగం నుండి వచ్చిన వ్యక్తిని మొదటిసారి చైర్‌పర్సన్‌గా నియమించారని ఆయన అన్నారు. ఇలాంటి చర్యల కారణంగా పరిపాలనా నిర్మాణం, సామాజిక న్యాయం రెండూ దెబ్బతింటున్నాయని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను ఇండియా కూటమి తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు.

నిరసనలకు అఖిలేష్ పిలుపు..

యూపీఎస్సీలో లేటరల్ విధానాన్ని సమాజ్‌వాదీ, బహుజన్ సమాజ్‌వాదీ పార్టీలు వ్యతిరేకించాయి. ఈ పథకానికి వ్యతిరేకంగా అక్టోబర్ 2న పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేయడాన్ని సహించబోమన్నారు. మరోవైపు బీఎస్పీ చీఫ్ మాయావతి సైతం లేటరల్ స్కీమ్‌ను వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు. ఈ పథకం ప్రస్తుతం ఉన్న అధికారులతో పాటు యువత భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి అవకా శాలు లేకుండా చేస్తుందని మాయవతి పేర్కొన్నారు. 45 ఉన్నత ఉద్యోగాల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ నిర్ణయం సరికాదన్నారు. ఎలాంటి నియమాక ప్రక్రియ లేకుండా ఖాళీలను భర్తీ చేయడం సరికాదని.. ఇలా చేయడం రాజ్యాంగ విరుద్ధమని మాయావతి పేర్కొన్నారు.

## అమెరికాలో తెలుగు సాఫ్ట్ వేర్ ఇంజినీర్ మృతి

అమెరికాలో ఐటీ ఇంజినీర్ గా పనిచేస్తున్న ఏపీకి చెందిన బుచ్చిబాబు ప్రమాదవశాత్తు మరణించారు. బుచ్చిబాబు వయసు 40 సంవత్సరాలు. బుచ్చిబాబు స్వస్థలం ప్రకాశం జిల్లా ముండ్లమూరు గ్రామం. కాలిఫోర్నియాలోని ఓ కంపెనీలో సాఫ్ట్ వేర్ ఇంజినీర్ గా పనిచేస్తున్న బుచ్చిబాబు వారాంతం సెలవుల్లో కుటుంబంతో కలిసి బీచ్ కు వెళ్లరు. అయితే అలల తీవ్రత కారణంగా సముద్రంలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. బుచ్చి బాబు మృతితో అతడి కుటుంబం తల్లడిల్లుతోంది. బుచ్చిబాబు తల్లిదండ్రుల గుండ కోతతో తీవ్ర విషాదంలో మునిగిపోయారు. స్వగ్రామం ముండ్లమూరు గ్రామంలోనూ విషాద ఛాయలు అలముకున్నాయి. కాగా, బుచ్చిబాబు మృతదేహాన్ని భారతకు తీసుకువ చ్చేందుకు ప్రభుత్వం తోడ్పాటు అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఇటీవలకాలంలో భారతీయ విద్యార్థులు, వృత్తి నిపుణులు విదేశాల్లో మరణిస్తున్న ఘటనలు తరచుగా చోటుచేసుకుంటున్నాయి.

## వినీలాకాశంలో కనువిందు చేయనున్న సూపర్ బ్లూమూన్!



వినీలాకాశంలో ఓ అరుదైన దృశ్యం ఆవిష్కృతం కాబోతున్నది. సోమవారం సూపర్ బ్లూ మూన్ ఆవిష్కృతం కాబోతున్నది. సాధారణంగా ఒక ఏడాదిలో రెండు, మూడు సూపర్ మూన్స్ ఏర్పడుతుంటాయి. బ్లూ మూన్ మాత్రం అరుదుగా ఏర్పడుతుందని అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా పేర్కొంది. అయితే, ఈ సారి మాత్రం సూపర్ మూన్, బ్లూ మూన్ కలయికలో సూపర్ బ్లూ మూన్ దర్శనం ఇవ్వబోతున్నది. పౌర్ణమి గడియల్లో చందమామ 90శాతం భూమికి దగ్గరగా వచ్చిన సూపర్ మూన్ ఆవిష్కృతమవుతుంది. దాంతో సాధారణంగా పౌర్ణమి రోజుల కంటే సూపర్ మూన్ సమయంలో చంద్రుడు మరింత ప్రకాశవంతం ఉండడంతో పాటు భారీ పరిమాణంలో కనిపిస్తాడు. నాలుగు పౌర్ణమిలలో మూడో పౌర్ణమి రోజున బ్లూ మూన్ ఏర్పడుతుంది. అయితే, బ్లూ మూన్ అంటే నీలం రంగులో మాత్రం కనిపించదు. కానీ, సాధారణంగా బ్లూ మూన్ అని పిలుస్తుంటారు. సూపర్ మూన్, బ్లూ మూన్ రెండూ ఒకేసారి రావడం అరుదుగా జరుగుతుందని ఖగోళ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఈ సారి సూపర్ బ్లూ మూన్ అనేది భారతీయులకు ఎంతో ముఖ్యమైన రాఖీ పండుగ రోజున రావడం మరింత ప్రాధాన్యం సంతరించుకున్నది. అయితే, 1979లో రిచర్డ్ నోల్లెచే సూపర్ మూన్ అనే పదాన్ని పరిచయం చేశారు. 2024లో వరుసగా సూపర్ మూన్‌లు ఆవిష్కరం కాబోతున్నాయి. ఇందులో రాఖీ పండుగ రోజున ఒకటి దర్శనం ఇవ్వనుండగా.. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లోనూ సూపర్ మూన్‌లో కనిపించనున్నాయి. పౌర్ణమి రోజు 25శాతం సూపర్ మూన్‌లు ఏర్పడితే 3శాతం మాత్రమే బ్లూ మూన్స్ ఆవిష్కృతమవుతాయి. ఇక ఈ రెండింటి కలయికలో ఇంకా అరుదుగా వస్తుందని ఖగోళ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. మళ్లీ సూపర్ మూన్, బ్లూ మూన్ రెండింటి కలయికలో 2037 సంవత్సరంలో దర్శనం ఇచ్చే అవకాశం ఉందని అంచనా. నాసా ప్రకారం అప్పుడప్పుడు పొగ, ధూళి తదితర చిన్న చిన్న కణాలు కాంతి ఎరుపు తరంగ దైర్ఘ్యాలను చెదరగొడుతుంటాయి. దాంతో చంద్రుడు నీలం రంగులో కనిపిస్తాడు.

## ప్రభుత్వ స్కూల్‌లో బిస్కెట్లు తిన్న విద్యార్థులు.. 80 మంది ఆసుపత్రిపాలు



**ముంబై:** ప్రభుత్వ స్కూల్‌లో బిస్కెట్లు తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వాంతులు కావడంతో వారిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏడుగురు విద్యార్థుల పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శనివారం ఉదయం కేకేట్ జల్గావ్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహార భోజన పథకం కార్యక్రమంలో భాగంగా బిస్కెట్లు ఇచ్చారు. అవి తిన్న తర్వాత వికారం, వాంతులతో విద్యార్థులు అస్వస్థత చెందారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న గ్రామపెద్దలు, ఇతర అధికారులు వెంటనే ఆ పాఠశాలకు చేరుకున్నారు. అనారోగ్యానికి గురైన విద్యార్థులను ఆసుపత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. వారిని గ్రామీణ ఆసుపత్రికి తరలించారు. బిస్కెట్లు తిన్న తరువాత స్కూల్‌లోని 257 మంది విద్యార్థుల్లో ఫుడ్ పాయిజనింగ్ లక్షణాలు కనిపించాయని ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ బాబాసాహెబ్ తెలిపారు. ఉదయం 8.30 గంటలకు 153 మంది బడి పిల్లలను ఆసుపత్రికి తీసుకువచ్చినట్లు చెప్పారు. మరోవైపు చికిత్స తర్వాత పలువురు విద్యార్థులను వారి ఇళ్లకు పంపేశారు. సుమారు 80 మందికి గ్రామీణ ఆసుపత్రిలో చికిత్స అందించారు. తీవ్ర లక్షణాలున్న ఏడుగురు విద్యార్థులను మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు వైద్యాధికారి తెలిపారు. ఫుడ్ పాయిజనింగ్ కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

ఉత్తరప్రదేశ్ లోని బులంద్ షహర్ జిల్లాలో ఆదివారం ఘోర ప్రమాదం జరిగింది. కార్మికులను ఇళ్లకు తీసుకెళుతున్న పికప్ వ్యాను, ఓ ప్రైవేటు బస్సు ఢీ కొన్నాయి. దీంతో ఫ్యాక్టరీ కార్మికులు పదిమంది అక్కడికక్కడే చనిపోయారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బులంద్ షహర్ లోని ఓ ఫ్యాక్టరీకి చెందిన కార్మికులను పికప్ వ్యాన్ ఆదివారం ఇళ్లకు తీసుకెళుతోంది. సేలంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎదురుగా వస్తున్న ఒక ప్రైవేట్ బస్సు కార్మికుల పికప్ వ్యాన్ ను బలంగా ఢీ కొట్టింది. దీంతో పికప్ వ్యాన్ లోని పదిమంది కార్మికులు స్పాట్ లోనే చనిపోయారు. మరో 27 మంది కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు వారిని ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంలో చనిపోయిన వారంతా అలీగఢ్ జిల్లా రాయ్ పూర్ ఖాస్ అహిర్ నాగ్లా గ్రామానికి చెందిన వారని పోలీసులు తెలిపారు. జిల్లా కలెక్టర్ చంద్రప్రకాశ్ సింగ్, ఎస్ఎస్పీ శ్లోక్ కుమార్ జిల్లా ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

# తూతూమంత్రంగా రుణమాఫీ

-మొదటిపేజీ తరువాయి

అనేక షరతులు పెట్టి 40 శాతం మందికి మాత్రమే రుణమాఫీ చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. 40 వేల కోట్ల రూపాయల రుణమాఫీ అని చెప్పి కేవలం 17 వేల కోట్ల రుణమాఫీతో రైతులను నట్టేట ముంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ఇచ్చిన హామీని నిలబెట్టుకుని రైతులందరికీ రుణమాఫీ చేయాలని తన లేఖలో డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యాప్తంగా రోడ్లపై ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. రైతులందరికీ రుణమాఫీ చేయకుంటే వారి తరఫున కాంగ్రెస్ పార్టీపై పోరాడతామని ఆ లేఖ ద్వారా హెచ్చరించారు.

**కేటీఆర్ లేఖ యథాతథంగా..**

గౌరవనీయులైన రాహుల్ గాంధీ గారు, మల్లికార్జున ఖర్గే గారికి

మీ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ నిర్వాకం వలన దగా పడిన లక్షలాది మంది తెలంగాణ రైతుల తరఫున మీకు ఈ లేఖ రాస్తున్నాను. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వైఫల్యాలతో ముఖ్యంగా ప్రభుత్వం ఘనంగా చెప్పుకుంటున్న రైతు రుణమాఫీ మోసం వలన లక్షలాదిమంది రైతులు తీవ్రమైన ఆవేదనలో ఉన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ రైతు డిక్లరేషన్ పేరిట మీరు విడుదల చేసిన హామీలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ అనేది అత్యంత కీలకమైన అంశం అనే విషయాన్ని మీకు గుర్తు చేస్తున్నాను.

అబద్ధాలు, అభూతకల్పనలతో తెలంగాణలో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రైతులను నిలువునా మోసం చేస్తున్నారు. అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న ఏకకాలంలో రెండులక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టిన సీఎం రేవంత్.. మూడు విడతలుగా మోసంచేస్తూ.. ఎనిమిది నెలలుగా ఊరించి ఊరించి చివరికి రైతులను ఉసూరుమనిపించారు. కనీసం 40 శాతం కూడా రుణమాఫీ పూర్తిచేయకుండానే వందశాతం రుణమాఫీ పూర్తయిపోయిందని ప్రకటించడం వందకు వందశాతం అబద్ధం. అందుకే తెలంగాణలో రుణమాఫీ పేరిట జరిగిన నయవంచనకు సంబంధించిన లెక్కలు మీకు తెలుసో లేదో అనే ఉద్దేశంతో సీఎం చెప్పిన అబద్ధాలు,



క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలకు మధ్య ఉన్న స్పష్టమైన తేడాను ఈ లేఖలో పొందుపరుస్తున్నాను.

గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు లక్షరూపాయల రుణమాఫీ చేస్తేనే 17 వేల కోట్లు ఖర్చయింది. ఏకంగా 36 లక్షల మంది రైతులు రుణవిముక్తులై లబ్ధి చేకూరింది. కాంగ్రెస్ చెబుతున్నట్టు రెండు లక్షల రుణమాఫీ పూర్తయితే.. లబ్దిదారుల సంఖ్యతోపాటు రుణమాఫీ మొత్తం పెరగాలి, దాదాపు రెట్టింపు కావాలి. కానీ కేవలం 17,900 కోట్లతో రెండు లక్షల రుణమాఫీని పూర్తిచేశామనడం ముఖ్యమంత్రి డొల్లవాదనకు నిదర్శనం. 47 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి 22 లక్షల మందికి తూతూమంత్రంగా చేయడం.. కాంగ్రెస్ సర్కారు అసమర్థతకు కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తోంది. అసలు లక్ష రూపాయల రుణమాఫీ కన్నా.. రెండు లక్షల రుణమాఫీ లబ్దిదారుల సంఖ్య 14 లక్షలు తగ్గడం రైతు రుణమాఫీ ఏ మేరకు విఫలమైందో అద్దం పడుతుంది. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ లెక్క ప్రకారం రెండు లక్షల రుణమాఫీకి 49,500 కోట్లు అంచనా వేశారు. ముఖ్యమంత్రే స్వయంగా రుణమాఫీకి 40వేల కోట్ల వరకు అవుతుందని తొలుత చెప్పుకొచ్చారు. కడుపు కట్టుకుంటే.. ఇది పెద్ద విషయం కాదని ఇంటర్వ్యూల్లో గొప్పలు చెప్పారు. చివరికి రాష్ట్ర కేబినెట్ సమావేశం వరకు వచ్చే సరికి 31 వేలకు దీన్ని కుదించారు. కనీసం అంతమేరకైనా చేశారా అంటే అదీ లేదు. రాష్ట్ర బడ్జెట్ లో మరింత కోత పెట్టి 26 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. తీరా మూడు విడతల రుణమాఫీ తతంగాన్ని రూ.17,933 కోట్లతో మమ అనిపించారు. 49,500 కోట్ల రూపాయల రెండు లక్షల రుణమాఫీ కాస్తా.. మూడు విడతల్లో దాదాపు మూడింతలు తగ్గి 17,933 చేరింది. 40 శాతం కూడా రుణమాఫీ చేయకుండా.. లక్షలాది మంది రైతులను నట్టేట ముంచి ప్రక్రియ పూర్తయిందని సీఎం రేవంత్ రెడ్డి చేతులెత్తేయడంతో.. యావత్ తెలంగాణ ఇవాళ రైతుల ఆందోళనలతో అట్టుడుకుతోంది. ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్ లో రుణమాఫీ కాని అన్నదాతలు రోడ్డెక్కారు. మంచిర్యాలలో రుణమాఫీ కాలేదని మనస్థాపం చెంది ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేశాడు. అటు కరీంనగర్ రాజీవ్ రహదారిపై అన్నదాతలు రాస్తారోకో నిర్వహించి సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. మొలంగూరులోని ఇండియన్ బ్యాంకు ఎదుట రైతులు బైఠాయించి నిరసన చేపట్టారు. వనపర్తిలో రైతువేదిక సాక్షిగా రుణమాఫీ కాని రైతులు అబద్ధాల ముఖ్యమంత్రికి పాలించే హక్కు లేదని నిలదీశారు. ఇటు జగిత్యాలలో రుణమాఫీ కాలేదని కెనెరా బ్యాంకు ముందు పెద్దఎత్తున ధర్నాకు దిగారు. ఇలా ఒకటా రెండు%ా% రుణమాఫీ కాని అన్నదాతల ఆందోళనలతో యావత్ తెలంగాణ అట్టుడుకుతోంది. దేవుడి మీద ఓట్ల పెట్టి మరీ మోసం చేసిన ముఖ్యమంత్రి తీరుపై రైతులోకం ఆగ్రహంతో ఊగిపోతోంది. ఇప్పటికే అనేక జిల్లాల్లో అప్పుల భారం భరించలేక ఎంతోమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అడ్డగోలు ఆంక్షలు..అర్థంలేని షరతులతో ఒక ప్రహసనంగా మార్చిన రుణమాఫీని రైతులందరికీ పూర్తిచేయాలి. రైతు రుణమాఫీకి సంబంధించి మా పార్టీ ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నెంబర్ కి కేవలం వారం రోజుల వ్యవధిలోనే 1,20,000 కు పైగా ఫిర్యాదులు వచ్చాయి. కాంగ్రెస్ అధిష్టానానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే.. రైతులను నిలువునా మోసం మోసం చేసిన ఈ రాష్ట్ర కాంగ్రెస్ సర్కారు తన వైఖరి మార్చుకొని రాష్ట్రంలోని అన్నదాతలందరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని రాష్ట్రంలోని అన్నదాతల పక్షాన డిమాండ్ చేస్తున్నాం. అప్పటివరకు తెలంగాణ రైతాంగం పక్షాన పోరాటం చేస్తామని తెలియజేస్తున్నాను.

# కాళేశ్వరంపై విచారణ వేగవంతం

-మొదటిపేజీ తరువాయి

కీలక ప్రజాప్రతిని ధులకు కూడా నోటీసులు వెళ్తాయంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అంటే ఎవరి పేరు గుర్తుకొస్తుందో.. వారికి కూడా సమన్లు వెళ్తాయా? వాళ్లు విచారణకు హాజరవుతారా

కాళేశ్వరం లిఫ్టుల్లో ఏమేం అక్రమాలు జరిగాయ్.. ఎంత అవినీతి జరిగింది.. నాణ్యతా లోపాలకు కారణాలేంటి, కారకులెవరు? వీటిని తేల్చేందుకు జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలో కమిషన్ వేసింది తెలంగాణ ప్రభుత్వం. ఇప్పటికే, కాళేశ్వరంలోని వివిధ బ్యారేజీలను కమిషన్ స్వయంగా పరిశీలించింది వచ్చింది. ప్రాజెక్ట్ కోసం పనిచేసిన ఇంజనీర్లను విచారించి.. అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణలో భాగంగా అధికారులు, ఇంజినీర్లు, ప్రైవేట్ వ్యక్తులకు సమన్లు జారీ చేసింది. అయితే.. ఈ నెలాఖరుతో కమిషన్ గడువు ముగుస్తుండడంతో.. ఆలోపే విచారణను ముగించేయాలనుకుంటోంది కమిషన్. ఎంక్వైరీని స్పీడప్ చేయాలనే ఉద్దేశంతో శుక్రవారమే హైదరాబాద్ వచ్చిన కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్.. జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ వి.ప్రకాష్‌ను విచారించారు.

తుమ్మిడిహట్టి బ్యారేజీ కట్టాలనే ఆలోచన మాజీ సీఎం కేసీఆర్‌కు ఉన్నప్పటికీ.. మహారాష్ట్ర ఒప్పుకోలేదని కమిషన్‌కు వివరించారు వి.ప్రకాష్. సరిపడినంత స్టోరేజీ లేకపోవడం వల్లే తుమ్మిడిహట్టి నిర్మాణం ఆలోచన ముందుకు వెళ్లలేదని కమిషన్‌కు స్పష్టం చేశారు. పైగా సీడబ్ల్యూసీ చెప్పినట్లు 164 టీఎంసీల్లో 64 టీఎంసీలు తెలంగాణవి కాదనే విషయం రిపోర్టుల్లోనే ఉందన్న విషయాన్ని కూడా కమిషన్‌కు గుర్తు చేశారు. తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత 54 టీఎంసీలే



ఉంటుందని అన్ని ఆధారాలు చూపించానన్నారు వి.ప్రకాష్. తెలంగాణ భవిషత్ కోసం తుమ్మిడిహట్టితో పాటు అన్ని ప్రాజెక్టులను మాజీ సీఎం కేసీఆర్ రీ-డిజైన్ చేశారని కమిషన్ ముందు చెప్పానన్నారు. ఈనెల 26న సాక్ష్యాలతో సహా మరోసారి కమిషన్ ముందు హాజరవుతానన్నారు.

ఈ నెలాఖరులోగా రిపోర్ట్ సమర్పించేందుకు రెడీ అవుతోంది కమిషన్. అంతకంటే ముందు గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన కొందరు ప్రజాప్రతినిధుల పాత్రపై కమిషన్‌కు అనుమానాలున్నాయి. అనుమానాల నివృత్తి కోసం.. కొందరు అధికారులు, ఇంజినీర్లు, ప్రైవేట్ వ్యక్తులకు నోటీసులు ఇచ్చి విచారణకు పిలవాలనుకుంటోంది కమిషన్. ప్రాజెక్ట్ నిర్మాణం, నిర్వహణ విషయంలో కీలకంగా వ్యవహరించిన అధికారులను విచారించిన కమిషన్.. వాళ్ల నుంచి ఇప్పటికి 50కిపైగా అఫిడవిట్లు రాబట్టింది. కానీ ఇంతవరకూ మాజీ సీఎస్ సోమేష్ కుమార్ మాత్రం అఫిడవిట్ సమర్పించలేదు. ఆయనతోపాటు స్పందించని మరికొందరు అధికారులకు రేపోమాపో నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచే అవకాశం కనిపిస్తోంది. సుందిళ్ల, అన్నారం బ్యారేజీలపై నివేదిక ఇవ్వాలంటూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్, నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఏజెన్సీ ఛైర్మన్‌ను కోరింది. వాళ్లు కూడా రిపోర్ట్ సబ్‌మిట్ చేయకపోవడంతో నోటీసులు ఇవ్వాలనే ఆలోచనలో చేయబోతున్నట్టు తెలుస్తోంది. ఇక అఫిడవిట్లు సమర్పించిన అధికారులను సైతం మరోసారి పిలిపించి.. క్రాస్ ఎగ్జామిన్ చేయనుంది కమిషన్. మొత్తంగా ఈ నెలాఖరు నాటికి కాళేశ్వరంపై విచారణను ముగించే లక్ష్యంతో పనిచేస్తోంది.

## త్వరలోనే రైతులందరికీ రుణమాఫీ

-మొదటిపేజీ తరువాయి



మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలోని నూతన మున్సిపాలిటీ భవనంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ ప్రావిణ్యతో కలిసి అమృత్ పథకం-2లో భాగంగా రూ. 11.74కోట్లతో పలు అభివృద్ధి పనులు, రూ.5కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మున్సిపాలిటీ కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడు తూ.. రాష్ట్ర రాజధానిలో జరిగిన పలు సమీక్షల్లో పరకాల అభివృద్ధిపై చర్చించామన్నారు. టెక్స్‌టైల్ పార్కును దేశంలోనే రోమ్ మోడల్ పార్కుగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ ఆలోచనలో ఉందన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూమి కోల్పోయిన రైతులకు మంచి ధర చెల్లించి అండగా ఉంటామని, భూ సేకరణ పూర్తి చేసి కేంద్ర ప్రభుత్వానికి అప్పగిస్తామని హామీ ఇచ్చారు.

# ప్రజలకు చేరువగా సర్కారు

-మొదటిపేజీ తరువాయి

20 జిల్లాల్లో అభిప్రాయాలు రాష్ట్రవ్యాప్తంగా 20 జిల్లాల్లో ఈనెల ఒకటో తేదీ నుంచి పదోతేదీ వరకు ప్రజల అభిప్రాయాలను ఆ సంస్థ సేకరించింది. ఇందులో 72 శాతం మంది ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. మెజారిటీ ప్రజలు కాంగ్రెస్ పార్టీ పాలనపై సానుకూలంగా స్పందించారని, ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు తోడు ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పనితీరు చాలా బాగుందని, ప్రజలకు బాగా దగ్గరైన ముఖ్యమంత్రిగా ఆయన పేరు తెచ్చుకున్నారని సర్వే సంస్థ వెల్లడించింది. పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నప్పటికీ ప్రధానంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి మాత్రం ఎక్కువ మార్కులు పడ్డాయి.వెంటనే స్పందించడం కలిసొస్తోంది నిరాడంబరంగా ఉండటం, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండటంతోపాటు ఏ విషయంపైనా వెంటనే స్పందించడంతోపాటు ప్రభుత్వం తరఫున, పార్టీ తరఫున బలమైన గళం వినిపిస్తుండటం రేవంత్ రెడ్డికి సానుకూల అంశాలయ్యాయి. రైతు రుణమాఫీ బాగా కలిసివచ్చింది. ఈ విషయంలో గ్రామీణ ప్రాంతాల్లోని రైతాంగం కాంగ్రెస్ సర్కారువైపే మొగ్గుచూపింది. విద్యార్థులు, నిరుద్యోగుల నుంచి కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి సానుకూలతే నమోదైంది. ఆడంబరాలకు దూరంగా ఉండటం ప్రస్తుత ప్రభుత్వానికి బాగా



కలిసివచ్చింది.

ఆర్టీసీ ఎంతో మేలు చేసింది రాజీవ్ ఆరోగ్యశ్రీ కవరేజ్ ను రూ.10 లక్షలకు పెంచడం, అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం.. ఈ రెండు అంశాలు రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజల దగ్గరకు చేర్చిందని సర్వే సంస్థ పేర్కొంది. ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలల్లోనే ప్రజల నుంచి భారీ మద్దతు దొరకడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రభుత్వ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీలు తమ ప్రభుత్వానికి మంచి మార్కులు వచ్చేలా చేశాయన్నారు.

## రాష్ట్రంలో ఐదురోజులు వర్షాలే!



రాగల ఐదురోజుల పాటు తెలంగాణవ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఉత్తర ఇంటీరియర్ కర్ణాటకను ఆనుకొని ఉన్న తెలంగాణ మీదుగా కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తులో నైరుతి దిశగా వంగి ఉందని తెలిపింది. ఉపరితల ఆవర్తనంపై నుంచి ద్రోణి ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక, తెలంగాణను ఆనుకొని ఉన్న ఆగ్నేయ ఆరేబియా సముద్రం మీదుగా కేరళగుండా సగటు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్లు విస్తరించి ఉందని తెలిపింది. ఆదివారం నుంచి సోమవారం ఆదిలాబాద్, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వానలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, నాగర్ కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ వానలు కురిసే అవకాశం పేర్కొంది.

## బీఆర్ఎస్ అవుట్ డేటెడ్ పార్టీ

-మొదటిపేజీ తరువాయి



డేటెడ్ పార్టీ అని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ ఎమ్మెల్యేల అవసరం కాంగ్రెస్‌కే ఉందన్నారు. అవినీతి పార్టీ బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోవాల్సిన ఖర్మ బీజేపీకి లేదన్నారు.

ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ కాక రైతులు కాంగ్రెస్ దిష్టి బొమ్మలు కాల్చేస్తున్నా పట్టించుకోరా? అని కేంద్రమంత్రి బండి సంజయ్ నిలదీశారు. రుణమాఫీ సహా 6 గ్యారంటీలపై చర్చను పక్కదారి పట్టించేందుకే ఈ విలీన డ్రామాలను తెరమీదకు తీసుకువస్తున్నారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి ఆడుతున్న డ్రామా ఇది అని బండి సంజయ్ ఫైర్ అయ్యారు. రుణమాఫీపై కాంగ్రెస్ మాట తప్పిందన్నారు. 64 లక్షల మంది రుణాలు తీసుకుంటే 22 లక్షల మందికే మాఫీ చేస్తారా? అని ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. రైతులందరికీ రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి.. ఎన్నికల్లో రూ. 40 వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించి.. బడ్జెట్‌లో రూ. 26 వేల కోట్లు కేటాయించి.. చివరకు రూ. 17 వేల కోట్లు మాత్రమే మాఫీ చేస్తారా? అని కేంద్ర మంత్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ మోసాలకు ప్రజలకు అర్థమయ్యాయని తెలిసే ఈ విలీన డ్రామాలకు తెరలేపారని విమర్శించారు. కాగా, గత రెండు రోజుల నుంచి బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతుందని కాంగ్రెస్ నేతలు.. లేదు లేదు కాంగ్రెస్‌లోనే బీఆర్ఎస్ విలీనం అవుతుందని బీజేపీ నేతలు వరుస ప్రకటనలు చేస్తూ పొలిటికల్ హీట్‌ను పెంచుతున్నారు. మరోవైపు.. చిల్లర ప్రచారాలు మానుకోవాలంటూ బీఆర్ఎస్ ముఖ్య నేతలు వార్నింగ్ ఇస్తున్నారు. మరి ఎవరి ప్రకటన ఎంత నిజమనేది తెలియాలంటే ఎదురు చూస్తూ ఉండాల్సిందే.

## వారి ఆత్మహత్యలకు కాంగ్రెస్ ప్రభుత్వానిదే బాధ్యత: కేటీఆర్..

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ దుష్ట పాలన చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్(%ఖ=%) ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారంటూ కేటీఆర్ ఎక్స్(ట్విటర్) వేదికగా మండిపడ్డారు. రాష్ట్రం ప్రభుత్వం వేతనం చెల్లించకపోవడంతో సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి వసీం ఆత్మహత్య చేసున్నారంటూ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనకు సంబంధించిన సూసైడ్ నోట్, సహా బాధితుడి ఫొటోలను కేటీఆర్ ట్వీట్‌కు జోడించారు. కుటుంబాన్ని ఎలా పోషించాలో అర్థంకాక వసీం ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారని ఆయన పేర్కొన్నారు. ప్రతినెలా ఒకటో తారీకునే జీతాలు చెల్లిస్తున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తోందని, అది పచ్చి అబద్ధమని చెప్పడానికి ఈ ఘటనే ఉదాహరణ అని కేటీఆర్ రాసుకొచ్చారు. వసీం మృతికి ఇప్పుడు బాధ్యులు ఎవరంటూ ఎక్స్ వేదికగా ఎమ్మెల్యే కేటీఆర్ ప్రశ్నించారు.

## అన్నారుగూడెంలో 9మంది రైతు కూలీలకు అస్వస్థత..



**ఖమ్మం:** తల్లాడ మండలం అన్నారుగూడెంలో 9మంది రైతు కూలీలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పొలంలో మందు చల్లుతూ తగిన జాగ్రత్తలు పాటించకపోవడంతో వారంతా అస్వస్థతకు లోనయ్యారు. బాధితులను హుటాహుటిన కల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నూతనకల్‌కు చెందిన వీరంతా పనుల నిమిత్తం అన్నారుగూడెం వెళ్లారు. అయితే మందు చల్లే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం, వేసవిని తలపిస్తున్న ఎండలకు కూలీలంతా అస్వస్థతకు గురయ్యారు. బాధితులను పరీక్షించిన వైద్యులు చికిత్స అందించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు కల్లూరు వైద్యులు వెల్లడించారు. అయితే రైతులు, రైతు కూలీలు పొలాల్లో మందు కొట్టే సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు, వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఒంటిపై మందు పడకుండా శరీరం మొత్తం ప్రత్యేకమైన వస్త్రాలతో కప్పుకోవాలని చెప్తున్నారు. అలాగే శ్వాస ద్వారా మందు లోపలికి వెళ్లి కళ్లు తిరగడం, వాంతులు లేదా తల తిరగడం వంటి సమస్యల బారిన పడే అవకాశం ఉందని, కాబట్టి ముక్కు ద్వారా మందు లోపలికి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

## సంపాదకీయం

# ఇక భారత్‌లో యుసీసీ

యుసిసి అన్ని వర్గాలకు మేలు మాత్రమే కాకుండా, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విజన్ అయిన 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్'కు అనుగుణంగా ఉంటుందని.. 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' ఆలోచనాతీరుతో నడుస్తుందని బీజేపీ వర్గాలు చెబుతూ వస్తున్నాయి. అయితే, యూసీసీలోని ప్రతిపాదనల్లో బహుభార్యత్వం, బాల్య వివాహాలపై పూర్తి నిషేధం, అన్ని మతాలలోని బాలికలకు ప్రామాణికమైన వివాహ వయస్సు, విడాకుల కోసం ఎవ్వరికైనా ఒకే ప్రక్రియ ఉన్నాయనీ.. లింగ సమానత్వం, సామాజిక ఐక్యతను పెంపొందించే లక్ష్యంతోనే ఈ చట్టాన్ని తీసుకువస్తున్నట్లు ఆ పార్టీ నేతలు వాదిస్తున్నారు. ఈ యూసీసీ ముసాయిదా పౌర జీవితంలోని వివిధ కోణాలకు ఆపాదించబడుతుంది. వారసత్వ హక్కులు, తప్పనిసరి వివాహ నమోదు, బాలికలకు పెరిగిన వివాహ వయస్సు, వివాహానికి ముందు వారి విద్యాభ్యాసాన్ని సులభతరం చేయడం వంటి సిఫార్సులు ఉన్నాయి. అదనంగా, తమ వివాహాలను నమోదు చేసుకోని జంటలు ప్రభుత్వ సౌకర్యాలకు అనర్హులవుతారు. కనుక ఇది చట్టపరమైన డాక్యుమెంటేషన్‌ను తప్పనిసరి చేసే చట్టంగా ఉపయోగపడుతుందని చెబుతున్నారు. అయితే, ఈ ప్రతిపాదిత యూసీసీ చట్టం.. ముస్లిం మహిళలతో సహా ప్రతి ఒక్కరికీ దత్తత హక్కులను మంజూరు చేస్తోందని అంటున్నారు. అయితే, ఇది హలాలా, ఇద్దత్ వంటి.. విడాకులు తీసుకున్నా? భర్త మరణించిన తర్వాత స్త్రీ తప్పనిసరిగా పాటించాల్సిన ఇస్లామిక్ పద్ధతులను తొలగిస్తోంది. అలాగే, లివ్-ఇన్ రిలేషన్స్ డిక్లరేషన్‌లో ఉన్న సహజీవనాన్ని ప్రోత్సహించడం, సులభమైన దత్తత ప్రక్రియల వంటి పద్ధతులను నిషేధిస్తుంది. ప్రతిపాదిత యూసీసీ అమల్లోకి వచ్చిన తర్వాత, ఇద్దరి మధ్య సహజీవనం అనేది చట్టం ప్రకారం నమోదు చేయాల్సి ఉంటుంది. అలాంటి సంబంధాలను నమోదు చేసుకోవడం వల్ల పురుషులు, మహిళలు ఇద్దరికీ ప్రయోజనం చేకూరుతుందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. దీనితో, మహిళలు నమోదు చేసే తప్పుడు కేసులు కూడా తగ్గుతాయనీ.. అలాంటి కేసుల్లో ఇప్పుడు చట్టపరమైన పవిత్రత ఉంటుందనే అభిప్రాయాలు ఉన్నాయి. ఇక యూసీసీ ఇతర ముఖ్య లక్షణాలను గమనిస్తే.. కుమారులు, కుమార్తెలకు సమాన ఆస్తి హక్కులు, చట్టబద్ధమైన, చట్టవిరుద్ధమైన పిల్లల మధ్య వ్యత్యాసాలను తొలగించడం.. దత్తత తీసుకున్న, బయోలాజికల్‌గా జన్మించిన పిల్లలకు సమాన హక్కులను అందిస్తుంది. ఒక వ్యక్తి మరణించిన సందర్భంలో, ప్రతిపాదిత జఅఅ ప్రకారం, జీవిత భాగస్వామి, పిల్లలు, తల్లిదండ్రులకు సమానమైన ఆస్తి హక్కులు అందుతాయి. అటువంటి హక్కులను పరిమితం చేసిన గత చట్టాలు దీనితో రద్దుచేయబడతాయి. అయితే, ఉత్తరాఖండ్‌లో అమలు చేస్తున్న ముసాయిదాలో జనాభా నియంత్రణ చర్యలతో పాటు, ఉత్తరాఖండ్ జనాభాలో 3 శాతం ఉన్న షెడ్యూల్డ్ తెగలను మినహాయించారు. దీని ప్రకారం, ఇతర రాష్ట్రాల్లో కూడా యూసీసీని తీసుకువస్తే షెడ్యూల్ తెగలను మినహాయించి, ఇతర హిందూయేతర కమ్యూనిటీలకు వర్తించే విధంగా.. అంటే, ముఖ్యంగా.. అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న ముస్లింలకు వర్తించే విధంగా దీన్ని అమలు చేయాల్సి ఉంటుంది. జఅఅని అమలు చేసిన మొదటి భారతీయ రాష్ట్రంగా ఉత్తరాఖండ్ అవతరించినప్పటికీ, ఇంకొన్ని రాష్ట్రాలు కూడా దీనిని అమలు చేయాలనే ఉద్దేశాన్ని పలుమార్లు వ్యక్తం చేశారు. కర్నాటకలో 2023 ఎన్నికల మేనిఫెస్టోలో బీజేపీ పార్టీ యూసీసీ అమలు చేస్తామని హామీ ఇచ్చింది. అయితే ఎన్నికల ఫలితాలు బీజేపీకి అనుకూలంగా రాలేదు. ఇక, గతేడాది ఫిబ్రవరి 2024 నాటికి అస్సాంలో యూసీసీని అమలు చేస్తామని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ చెప్పారు. ట్రిపుల్ తలాక్ గురించి శర్మ మాట్లాడుతూ, "ఎవరూ ఒకరి కంటే ఎక్కువ మంది భార్యలను కలిగి ఉండటానికి అనుమతించబడరు. మన ముస్లిం మహిళల గొప్ప ప్రయోజనాల కోసం యూనిఫాం సివిల్ కోడ్‌ను అమలు చేయాలి" అని అన్నారు. అలాగే, జూన్ 2023లో, ప్రధాని మోడీ మహారాష్ట్రలో యూసీసీ అమలు చేస్తామని చెప్పారు. దీనిపై ఆ రాష్ట్రం తొమ్మిది మంది సభ్యుల కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఇక, 2022లో, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, హర్యానా, గుజరాత్‌లో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాలు కూడా యూసీసీ అమలు చేస్తామని చెప్పారు. అయితే, ఇంతవరకూ ఉత్తరాఖండ్ మినహా ఇతర రాష్ట్రాలు ఏవీ ప్రతిపాదనను ముందుకు కొనసాగించలేదు. అయితే, ఈ సమస్యకు మూలాలు బ్రిటీష్ వలస పాలనలోనే మొదలయ్యాయి. దీనికి హిందూ కోడ్ బిల్లు సాక్ష్యంగా నిలించింది ఒకవైపు పురుషాధిక్య సమాజం, మరోవైపు మత విశ్వాసాల మధ్య జీవిస్తున్న సమాజంలో చట్టం అమలు.. దాని లక్ష్యానికి తగ్గట్లు వ్యక్తులను, ముఖ్యంగా స్త్రీలకు రక్షణ కల్పించడం కష్టసాధ్యంతో కూడుకున్న పని. అంతకుమించి, ఈ చట్టం కుటుంబ సంబంధాల్లో మరిన్ని సమస్యలు తెచ్చే పెట్టే అవకాశం ఉందనే వాదనలూ లేకపోలేదు. చట్టం చుట్టూ.. ఏకరూపత, లింగ సమానత్వం, సాంఘిక ఏకీకరణ కనిపిస్తున్నప్పటికీ.. అదే సమయంలో మత స్వేచ్ఛ, వ్యక్తిగత హక్కుల గురించి ఆందోళనలను కూడా పెంచుతుంది. ఇక, భారతదేశంలో ఉన్న వ్యక్తిగత చట్టాలు, ప్రస్తుత మతపరమైన ఆచారాలు, సంప్రదాయాల ఆధారంగానే ఉన్నాయి. హిందూ వ్యక్తిగత చట్టాలనేవి పురాతన గ్రంథాలు, ఆచారాల నుండి ఉద్భవించాయి. హిందూ సమాజంలో వివాహం అనేది విడాకులు, వారసత్వం వంటి విషయాలను నియంత్రిస్తాయి. మరోవైపు, ముస్లిం పర్సనల్ లా బోర్డు, ముస్లింల వ్యక్తిగత విషయాలను పర్యవేక్షిస్తుంది. అలాగే, ఇతర మత సంఘాలు వారి స్వంత వ్యక్తిగత చట్టాలను కలిగి ఉంటాయి. అయితే, వీటన్నింటనీ నిషేధిస్తూ ఈ చట్టం రావడం వారి మనోభావాలను పూర్తిగా విస్మరించడమే అనే వాదనలు వస్తున్నాయి. యూనీఫాం సివిల్ కోడ్ అమలుకు ఉన్న సవాళ్లలో మత పెద్దలదే కీలక పాత్ర. వీరిలో కొందరు సామరస్యం, జాతీయ సమైక్యతల కోసం వాదిస్తుంటే.. మరికొందరు మత స్వేచ్ఛ, సాంస్కృతిక పద్ధతులపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇవి మతాంతర వివాహాలు, సంబంధాలపై ప్రభావం చూపిస్తాయి. వివాహంలో స్థిరత్వాన్ని నిర్ధారిస్తుంది. విభిన్న మతపరమైన నేపథ్యాలకు చెందిన జంటలు ఎదుర్కొనే సంక్లిష్టతను తగ్గిస్తుంది. అదే సమయంలో కుల దురహంకార పరువు హత్యలను మరింత తీవ్రతరం చేసే అవకాశం కూడా ఉంటుందనే వాదనలు ఉన్నాయియూనిఫాం సివిల్ కోడ్‌కు సంబంధించి వివిధ సంఘాలు భిన్నమైన అభిప్రాయాలు, ఆందోళనలను కలిగి ఉన్నాయి. కొందరు మెరుగైన సాంఘిక ఐక్యత ఉంటుందని చెబుతుంటే.. మరికొందరు సాంస్కృతిక గుర్తింపు కోల్పోవడం గురించి భయాందోళనలను వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల మధ్య మోడీ ప్రతిపాదిస్తున్న ఈ సెక్యులర్ సివిల్ కోడ్ వ్యవహారంలో రాష్ట్రాలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటాయో చూడాల్సి ఉంది.

# క్రీడల్లో మనమెందుకు వెనుకబడ్డాం?



అనేక చిన్న చిన్న దేశాలు ఒలింపిక్స్‌లో పత కాలు ఎగరేసుకుపోతుంటే, మనదేశం అరకొర మెడల్స్‌తోనే సంతృప్తి పడుతోంది. ఒలింపిక్స్‌లో పతకాలు కొల్లగొడుతున్న అనేక దేశాలు మనతో పోలిస్తే పేద దేశాలే..ఆదాయ పరంగానే కాదు, మానవ వనరులలోనూ మనతో పోటీకి రాని దేశాలే. అయితేనేం, పతకాలు గెలుస్తున్నాయి. అక్కడి ప్రభుత్వాలు క్రీడల కోసం పెడుతున్న ఖర్చు మనతో పోలిస్తే బాగా ఎక్కువ. మనదేశం క్రీడల కోసం వార్షిక బడ్జెట్‌లో చేస్తున్న కేటాయింపులు తక్కువే. అరకొర కేటాయింపులతోనే పాలకులు కాలం గడుపుతున్నారు. దేశంలో క్రీడల పట్ల ఆసక్తి ఉన్న యువతను గుర్తించి, వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత నిస్సందేహంగా ప్రభుత్వాలదే. అవసరమైతే ఆయా క్రీడా విభాగాల్లో అత్యుత్తమమైన కోచ్‌లను విదేశాల నుంచి రప్పించుకోవాలి. మన క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇప్పించాలి. అప్పుడే ఒలింపిక్స్ లో రెండంకెల పతకాలకు మనం చేరుకోగలం. దురదృష్టవశాత్తూ మనదేశంలో క్రీడలు ఇప్పటికీ ఒక లాభదాయకమైన కెరీర్ కాలేకపోయింది. చదువులో వెనుకబడిన వారు మాత్రమే ఆటలపై ఆసక్తి చూపుతారన్న అభిప్రాయం సమాజంలో బలంగా నాటుకుంది. ఈ అభిప్రాయంతో ఎంతమంది ఏకీభవిస్తారన్న అంశాన్ని పక్కన పెడితే, క్రీడల్లో భారత్ బాగా వెనుకబడి ఉందన్న విషయం వాస్తవం. ఒలింపిక్స్ పోటీలే దీనికి ఉదాహరణ. ఒలింపిక్స్ చరిత్రలో భారతదేశం మొత్తం 41 పతకాలను మాత్రమే గెలుచుకుంది. మిగతా దేశాలతో పోలిస్తే ప్రతి ఒలింపిక్స్‌లోనూ మనదేశం పతకాల వేటలో వెనుకబడే ఉంటోంది. మనకంటే విస్తీర్ణంలోనూ, మానవ వనరులలోనూ వెనుకబడ్డ అనేక చిన్న చిన్న దేశాలు ఒలింపిక్స్‌లో పతకాలు ఎగరేసుకుపోతుంటే, మనదేశం మాత్రం అరకొర మెడల్స్‌తోనే సంతృప్తి పడుతోంది. ఈ పరిస్థితికి అనేక కారణాలున్నాయి.. దేశంలోని చాలా మంది నాణ్యమైన విద్యను పొందుతున్న మొదటి తరం ఇది. దీంతో క్రీడలపట్ల తల్లితండ్రుల వైఖరి మారింది. పిల్లలు తమలా కష్టాలు పడకూడదని తల్లిదండ్రులు నిర్ణయించుకున్నారు. ఆటలతో సమయం వృథా తప్ప ప్రయోజనం ఏమీ ఉండదన్న ఒక స్థిరమైన నిర్ణయానికి తల్లిదండ్రులు వచ్చేశారు. తమ పిల్లలు పెద్దయ్యాక డాక్టరో, ఇంజనీరో కావాలని తల్లిదండ్రులు కలలు కంటున్నారు. అంతేకాదు, తమ కలలు సాకారం చేయాలంటూ చిన్నప్పటి నుంచే పిల్లలపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో పిల్లలకు క్రీడల పట్ల ఆసక్తి ఉన్నా, తల్లిదండ్రుల ప్రోత్సాహం కరువవుతోంది. దీంతో క్రీడలను కెరీర్‌గా ఎంచుకునే వైపు చిన్నారులు పెద్దగా కృషి చేయలేకపోతున్నారు. దేశంలో సగం జనాభా పేదరికంలో ఉన్న పుడు, రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాల నుంచి వచ్చిన చిన్నారులు క్రీడలను కెరీర్‌గా మలచుకుంటారని ఆశించ డం కూడా దురాశే అవుతుంది. కొంత మంది చిన్నారులకు క్రీడల పట్ల ఆసక్తి ఉన్నా, వారు ఆడుకోవడానికి సరైన ప్రాంగణాలు దొరకడం లేదు. క్రీడా ప్రాంగణాలకు అనువైన స్థలాలే కాదు, అసలు ఎకరం స్థలం కూడా దొరకని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. దేశవ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ప్లే గ్రౌండ్‌లు అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నా ఎక్కడా ఎకరం భూమి కూడా దొరకని దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఇప్పటితరం చిన్నారులు ప్లే గ్రౌండ్‌లు లేని పాఠశాల ల్లోనే చదువులు పూర్తి చేస్తున్నారు. క్రీడాకారులకు అనేక ప్రభుత్వరంగ సంస్థల్లో రిజర్వేషన్లున్నాయి. అయితే క్రీడాకారు ల కోటాను సరిగా అమలు చేయడం లేదన్న ఆరోపణలు వస్తు న్నాయి. క్రీడల కోసం వార్షిక బడ్జెట్‌లో చేస్తున్న కేటాయిం పులు కూడా తక్కువే. అరకొర కేటాయింపులతోనే పాలకులు కాలం గడుపుతున్నారు. మనదేశంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా లాంటి జాతీయ స్థాయి సంస్థలున్నా.. క్రీడాభివృద్ధి కోసం చేస్తున్న కృషి నామమాత్రమే అనే విమర్శలు వస్తున్నాయి. క్రీడల అభివృద్ధి కోసం కృషి చేయాల్సిన సంస్థలు రాజకీయాల్లో మునిగి తేలుతున్నాయన్న ఆరోపణలు సైతం ఉన్నాయి. అయితే క్రీడలకు సంబంధించి అనేక సోషలిస్టు దేశాల్లో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. అయా దేశాల్లో స్టేట్ యూత్ డిపార్ట్‌మెంట్ల ద్వారా ఆణిముత్యాల్లాంటి క్రీడాకారులను సోషలిస్టు దేశాలు తయారు చేసుకుంటున్నాయి. ఒలింపిక్స్‌లో మెడల్స్ కొల్లగొడుతున్నాయి. మనదేశంలో క్రీడల అభివృద్ధికి సంబంధించి పక్కా ప్రణాళిక అంటూ లేదు. క్రీడాకారులకు మౌలిక వసతులు కూడా కరువే. క్రీడాభివృద్ధి కోసం అంకితమై కృషి చేసే కోచ్‌లు, ఫిజికల్ ఇన్‌స్ట్రక్టర్లకు మనదేశంలో తీవ్ర కొరత ఉంది. అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే సత్తా ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులను ముందుగా గుర్తించాలి. ఆ తరువాత వారిని ప్రోత్సహించేలా పాలకులు చర్యలు చేపట్టాలి. అయితే మనం ఇక్కడో చేదు వాస్తవాన్ని అంగీకరించి తీరాలి. క్రికెట్‌కు క్రీడా సంఘాలు, పౌర సమాజం ఇచ్చినంత ప్రాధాన్యం ఇతర క్రీడలకు ఇవ్వడం లేదన్న విమర్శలున్నాయి. ఈ విషయంలో ఆయా సంఘాల తీరు మారాలంటున్నారు క్రీడాభిమానులు. చైనా సహా అనేక దేశాలు తమ అథ్లెట్ల శిక్షణా పద్ధతులను మెరుగుపరచడానికి సాంకేతికతను కూడా బాగా ఉపయోగించుకుంటున్నాయి. ఈ విషయంలో భారత్ ఇంకా వెనుకబడే ఉందని చెప్పుకోవాలి. భారత్‌లో ప్రతిభావంతులైన క్రీడాకారులకు కొదవ లేదు. వీరికి తగిన ప్రోత్సాహం దొరకడం లేదన్న వాదన బలంగా వినిపిస్తోంది. క్రీడల పట్ల ఆసక్తి ఉన్న యువతను గుర్తించి, వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత నిస్సందేహంగా ప్రభుత్వాలదే. అవసరమైతే ఆయా క్రీడా విభాగాల్లో అత్యుత్తమమైన కోచ్‌లను విదేశాల నుంచి రప్పించుకోవాలి. మన క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇప్పించాలి. సరైన ప్రోత్సాహం లభిస్తే మారుమూల పల్లె ప్రాంతాల నుంచి ఒక ధ్యాన్‌చంద్, ఒక మిల్కా సింగ్ లాంటి క్రీడాకారులు, అథ్లెట్లు తయారవుతారు.

# భారత - పాకిస్థాన్ మధ్య విభజన చిచ్చు



రాడ్ క్లిఫ్ రేఖ అంటే చాలా మందికి తెలియక పోవచ్చు. అది భారత, పాకిస్తాన్ మధ్య విభజన రేఖ. సర్ సిరిల్ రాడ్ క్లిఫ్ నేతృత్వంలోని సరిహద్దుల కమిషన్ ఈ రేఖను నిర్ధారించింది. రాడ్ క్లిఫ్ రేఖ 1947 ఆగస్టు 17న భారత దేశ విభజన అనంతరం భారత పాకిస్తాన్ ల నడుమ సరిహద్దు రేఖగా ఏర్పరచారు. భారత్ లో బ్రిటిష్ రాజ్యం మరో నెల రోజుల్లో, అంటే 1947 ఆగస్టు 15న ముగుస్తుందని భారత స్వాతంత్ర్య చట్టం, 1947 ద్వారా బ్రిటిష్ పార్లమెంటు 1947 జూలై 15న పేర్కొంది. భారత దేశాన్ని రెండు భాగాలుగా విభజించాలని కూడా అది వివరించింది. పాకిస్తాన్ ముస్లింల రాజ్యంగా కొనసాగాలని, అదే సమయంలో భారత్ హిందూ మెజారిటీతో కూడిన లౌకిక రాజ్యంగా ఉండాలని ఉద్దేశించారు. ఉత్తరాదిన ఉన్న ముస్లిం ప్రాబల్య ప్రాంతాలు పాకిస్తాన్ గా రూపుదిద్దు కోవాలని నిర్ణయించారు. బలూచిస్థాన్ (విభజనకు ముందు 91.8 శాతం ముస్లిం జనాభా), సింధ్ (72.7 శాతం ముస్లిం జనాభా) ప్రావిన్సులను పూర్తిగా పాకిస్తాన్ కు కేటాయించారు. అయితే, ఈశాన్య బెంగాల్ (54.4 శాతం ముస్లింలు), వాయవ్యాన పంజాబ్ (55.7 శాతం) ప్రావిన్సుల్లో పూర్తిగా ముస్లిం మెజారిటీ లేకపోయింది. దాంతో పంజాబ్ పశ్చిమ భాగం పశ్చిమ పంజాబ్ మారింది. తూర్పు ప్రాంతం పంజాబ్ రాష్ట్రం పేరుతో భారత్ లో అంతర్భాగమైంది. బెంగాల్ కూడా అదే మాదిరిగా తూర్పు బెంగాల్ పాకిస్తాన్ లో, పశ్చిమ బెంగాల్లో భారత్ లో విలీనమైంది. ఇక పంజాబ్ లో జనాభా విస్తృతి సంక్లిష్టంగా ఉంది. దాంతో దాన్ని హిందూ, ముస్లిం, సిక్కుల ప్రాంతాలుగా స్పష్టంగా విభజించ లేని పరిస్థితి ఏర్పడింది. అదే విధంగా మహ్మదాలీ జిన్నా నేతృత్వంలోని ముస్లిం లీగ్, జవహర్ లాల్ నెహ్రూ, పటేల్ సారథ్యం లోని భారత జాతీయ కాంగ్రెస్, బ్రిటిష్ వారందరినీ సంతృప్తి పరిచే విభజన ప్రణాళిక కూడా ఏదీ లేకపోయింది. వీలనంత త్వరగా భారత్ ను విడిచి వెళ్లిపోవడమనే బ్రిటిష్ ప్రభుత్వ తక్షణావసరాల కారణంగా ఐక్యరాజ్య సమితి వంటి బయటి సంస్థల నిపుణులకు సరిహద్దు నిర్ణయ ప్రక్రియలో భాగస్వామ్యం లేకపోయింది. భారత వైస్రాయిగా పనిచేసిన లార్డ్ వేవెల్, అంతకు ముందు 1947 ఫిబ్రవరిలో లార్డ్ లూయిస్ మౌంట్బాటెన్ అప్పటికే ఒక సరిహద్దు రేఖను సిద్ధం చేశారు. రెండు దేశాలకు ఏయే ప్రాంతాలను అప్పగించాలో ఇదమిత్థంగా నిర్ధారించేందుకు 1947 జూన్ లో సర్ సిరిల్ రాడ్ క్లిఫ్ ను బెంగాల్, పంజాబ్ సరిహద్దు కమిషన్లు రెండింటికీ చైర్మన్ గా బ్రిటన్ నియమించింది. పంజాబ్ లో ముస్లిం, ముస్లిమేతర మెజారిటీ ప్రాంతాలను వీలైనంత స్పష్టంగా విడదీస్తూ ఇరు ప్రాంతాల మధ్య సరిహద్దులను నిర్ధారించా ల్సిందిగా కమిషన్ కు సూచనలందాయి. 1947 జులై 8న ఢిల్లీలో అడుగు పెట్టిన రాడ్ క్లిఫ్.. ఆగస్టు 12 నాటికి పూర్తి చేశారు. భారత్ గురించి ఏ మాత్రం తెలీకుండా.. చివరకు బెంగాల్.. పంజాబ్ ప్రాంతాలు ఎక్కడ ఉంటాయో కూడా తెలీకుండానే రాడ్ క్లిఫ్ దేశ విభజనను పూర్తి చేయటం విశేషం. భారత్ గురించి ఏ మాత్రం అవగాహన లేని వ్యక్తి, తనకు చెప్పిన పనిని చెప్పినట్లుగా చేయటం, అందుకు తనకున్న అవగాహనతో గీసిన గీతలు, నిర్ణయించిన హద్దులు, కోట్లాది మంది ప్రజల బతుకుల్ని, భవిష్యత్తును నిర్దేశించాయి. భారీ మారణ హెరీమానికి కారణ మయ్యాయి. జూలై 8న భారత్ వచ్చాక, రాడ్ క్లిఫ్ కు సరిహద్దు నిర్ణయానికి కేవలం 5 వారాలు మాత్రమే ఇచ్చారు. ఆయన వెంటనే తన కాలేజీ సహాధ్యాయి మౌంట్ బాటెన్ ను కలిశాడు. తర్వాత ఇద్దరూ లాహోర్, కలకత్తా వెళ్లి కమిషన్ సభ్యులను కలిశారు. ముఖ్యంగా కాంగ్రెస్ నుంచి నెహ్రూను, ముస్లిం లీగ్ అధ్యక్షుడు జిన్నాను కలుసుకున్నారు. అంత తక్కువ కాలావధి ఇవ్వడాన్ని ఆయన అభ్యంతర పెట్టారు. కానీ ఆగస్టు 15న భారత్ నుంచి బ్రిటిష్ వారు వెళ్లిపోయే లోపే ఈ పని పూర్తవాలని ఇరు వర్గాలూ పట్టుబట్టాయి. దాంతో మరో అవకాశం లేకపోయింది. ఈ తక్కువ డెడ్ లైన్ షరతు మీదే మౌంట్బాటెన్ భారత వైస్రాయి పదవిని అంగీకరించారు. ఈ నిర్ణయాన్ని బ్రిటిష్ వారు వెళ్లిపోవడానికి కేవలం 2 రోజుల ముందే తీసుకున్నారు. కానీ రాజకీయ కారణాల వల్ల ఆగస్టు 17 దాకా, అంటే భారత్, పాకిస్తాన్లకు స్వాతంత్ర్యం ఇచ్చిన రెండు రోజుల దాకా దాన్ని బయట పెట్టలేదు. రాడ్ క్లిఫ్ తన నియామకానికి ముందు భారత్ ను ఒక్కసారి కూడా సందర్శించ లేదు. ఆయన వ్యక్తిగత కార్యదర్శి క్రిస్టోఫర్ బీమంటకు మాత్రమే పంజాబ్ జీవన విధానం, అక్కడి యంత్రాంగాన్ని గురించిన అవగాహన ఉంది.. తన వ్యవహారాల్లో పూర్తి పారదర్శకత ఉందని నిరూపించు కోవడానికి గాను కనీసం వైస్రాయ్ మైంట్బాటెన్ కూడా కలవకుండా రాడ్ క్లిఫ్ పూర్తి దూరం పాటించారు. రాడ్ క్లిఫ్ కు కేవలం నెల రోజుల వ్యవధి మాత్రమే ఉండటంతో అనుకూలంగా గ్రామాలను విభజించడానికి జాగ్రత్తలు తీసుకునే సావకాశం చిక్కలేదు. ఆయన నిర్ధారించిన సరిహద్దు అస్తవ్యస్తమైంది. కొన్ని ప్రాంతాల మధ్య నుండి కాక నేరుగా వాటి మీదుగా వెళ్లింది. విభజన రేఖ ఒకే ఇంట్లో కొన్ని గదుల్ని భారత్ కు, మరికొన్ని గదుల్ని పాకిస్తాన్ కు కూడా కేటాయిస్తూ సాగిన ఉదంతాలు కోకొల్లలుగా ఉండడం గమనార్హం. రాడ్ క్లిఫ్ తాను భారత్ నుంచి వెళ్లే ముందు ఈ ప్రక్రియకు సంబంధించిన అన్ని పత్రాలనూ నాశనం చేశాడు. ఆయన స్వాతంత్ర్య దినం రోజునే భారత్ విడిచి వెళ్లిపోయాడు. తాను నిర్ణయించిన సరిహద్దులను సాధికారికంగా ప్రకటించడానికి కూడా ముందే దేశాన్ని వదిలాడు. అన్ని రికార్డులనూ రాడ్ క్లిఫ్ నాశనం చేయగా, మౌంట్బాటెన్ కూడా ఈ విషయాలు తనకేమీ తెలియదని చెప్పారు. విభజన అనంతరం. సరిహద్దు రేఖల నిర్ణయాన్ని అమలు చేసుకోవాల్సిన బాధ్యత భారత, పాకిస్తాన్ ప్రభుత్వాలపై పడింది. 1947 ఆగస్టు 15న తాము సరిహద్దులకు ఏ వైపుకు చెందామన్నది అక్కడి గిరిజనుల్లో చాలామందికి తెలియక పోవడాన్ని బట్టి ఎంత అవగాహన రాహిత్యంతో విభజించారో అర్థం చేసుకోవచ్చు. చివరికి విభజన అమలు సందర్భంగా... ఉపఖండంలో దాదాపు 1.4 కోట్ల మంది ప్రజలు సొంత ఇళ్లను వదులుకున్నారు. బస్సులు, రైళ్లు, విమానాలు, కార్లు, లారీలు, ఎడ్లబళ్లు, ఇంకా అత్యధికులు కాలి నడకన తమ సొంత వారితో కలిసి ఆవాసాన్ని వెదుక్కునేందుకు బయల్దేరారు. వారిలో చాలామంది అవతలి పక్షం వారి చేతుల్లో హత్యకు గురయ్యారు. మరికొందరు ఆకలికి తాళలేక ప్రాణాలు విడిచారు. ఇంకా కొంతమంది ప్రాణాంతక వ్యాధులకు బలయ్యారు. ఈ మొత్తం ప్రక్రియలో మరణించిన వారి సంఖ్య కనీసం 2 లక్షల (ఇది ఆ సమయంలో బ్రిటిష్ ప్రభుత్వం పేర్కొన్న గణాంకాలు) నుంచి 20 లక్షల దాకా ఉంటుందని అంచనా వేశారు. అంతిమంగా ఈ సరిహద్దు వివాదాలే భారత్, పాకిస్తాన్ మధ్య 1947, 1965, 1971ల్లో యుద్ధాలకు కూడా దారితీశాయి. 1998 మేలో కూడా ఇరు దేశాలూ అణ్వాయుధ పరీక్షలు జరిపేందుకు, 1999లో కార్గిల్ యుద్ధానికి కూడా అవే కారణమయ్యాయి. నాటి తొందరపాటు చర్యలతో అస్తవ్యస్త విభ జన ఫలితంగా నేటికీ భారత పాకిస్థాన్ దేశాల మధ్య వివాదాలు కొన సాగుతూ, పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే స్థితి నెలకొని ఉంది.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374 వ జయంతి వేడుకలు

## లిబహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్.



**చింతపల్లి, ఆగస్టు 18 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ మండల అధ్యక్షుడు అనంతుల వెంకటయ్య గౌడ్,అనంతుల పెద్ద జంగయ్య గౌడ్, అనంతుల మల్లేష్ గౌడ్ అన్నారు. పాపన్న గౌడ్ 374 జన్మదిన వేడుకలను చింతపల్లి మండలం కుర్మేడు చౌరస్తాలోని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ గోల్కొండ ను ఏలిన మొదటి విప్లవ వీరుడు బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని వారన్నారు. దొరల దోపిడీని , జమీందారుల జాగీర్ ను , పెత్తందారుల పెత్తనాన్ని , ఆధిపత్య వర్గాల ఆగడాలను భరించలేక అడ్డమైన పన్నులను అడ్డూ అదుపూ లేకుండా వేసి అన్యాయంగా ప్రజల కష్టార్జితాన్ని దోచుకునే తుష్కర సైన్యాన్ని ఎదిరించి, బహుజనులు కేవలం కులవృత్తులే కాదు కత్తిపట్టి కదనరంగంలో కవాతుచేస్తూ శత్రువుల గుండెలను చీల్చగలరని నిరూపించిన బహుజన ధీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని అన్నారు.తాను కత్తి పట్టిన మరుక్షణం నుండి తన స్నేహితులు చాకలి సర్వన్న , మంగలి మసన్న , కుమ్మరి గోవిందు , జక్కుల పెరుమాళ్ళు , దూదేకుల పేరు , కొత్వాల్ మీరు ల సహాయంతో వేల సంఖ్యలో బహుజన సైన్యాన్ని ఏర్పాటు చేసి ప్రజల కష్టాన్ని అక్రమంగా దోచుకుని నిర్మించుకున్న దొరల గడీలను కొల్లగొట్టి అక్కడి సంపదనంతా ప్రజలకు పంచిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న . అలా ప్రజల అండదండలతో తన సొంత ఊరు ఖిలాసపూర్ లో , సర్వాయిపేట లో , భువనగిరి లో, తాటికొండలో కోటలను నిర్మించి చివరికి మొఘల్ రాజులను ఎదిరించి గోల్కొండకోటలో బహుజన జెండా ఎగురవేసి స్వేచ్ఛ సమానత్వపు బహుజన రాజ్యాన్ని స్థాపించిన తెలుగు బిడ్డ " మహా రాజు " సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జన్మదినం సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి హరి నాయక్, కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీటీసీ ఉప్పు శ్రీశైలం, గౌని జంగయ్య గౌడ్,రాటకొండ నరేంద్ర ప్రసాద్,జెల్లా నరసింహ్మా గౌడ్ , పందుల యాదయ్య గౌడ్, కళ్ళు గీత కార్మికుల సంఘం గ్రామ శాఖ అధ్యక్షులు గౌని రవి గౌడ్, మాజీ వాట్స్ సభ్యులు బుర్రి యాదయ్యగౌడ్,అనంతల మల్లేష్ గౌడ్,రౌతు యాదయ్య గౌడ్,అలవాల వెంకటయ్య గౌడ్, గజ్జ అనిల్ గౌడ్, పవన్ గౌడ్, చిక్కొండ సాయి, నూనె కిరణ్ తదితరులు ఉన్నారు.

# ఉప్పరిగూడలో ఘనంగా బోనాల ఉత్సవాలు





**-స్ఫూర్తి, 7 స్టార్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా తొట్టెల ఊరేగింపు**

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 18 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఉప్పరిగూడ గ్రామంలో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆదివారం జరిగిన ఈ బోనాల ఉత్సవాలు డబ్బుచప్పుళ్ళు, శివసత్తులు,పోతురాజుల నృత్యాలనడుమ మహిళలు బోనాలతో పెద్దఎత్తున ఊరేగింపుగా వెళ్లి పోచమ్మ, మైసమ్మ అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఉప్పరిగూడ గ్రామంలోని స్ఫూర్తి, 7 స్టార్ యూత్ ఆధ్వర్యంలో తొట్టెల ఊరేగింపు ఫలహారం బండి ఊరేగింపు ఘనంగా తసారు. అదేవిధంగా ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని వివిధ గ్రామాలలో గ్రామ దేవతలకు మహిళలు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలో ఉప్పరిగూడ గ్రామం పెద్దలు గ్రామస్తులు, బంధువులు, తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

# గులాబీలో ఆపరేషన్ బాలి...

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ మధ్య టామ్ అండ్ జెర్రీ పోరాటం హోరాహోరీగా కొనసాగుతోంది. విదేశీ పర్యటన నుంచి తిరిగొచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఆపరేషన్ ఆకర్ష్ 2.ూ ప్రారంభించేందుకు కసరత్తు చేస్తుండగా, సీఎం వలకు ఎవరూ చిక్కకుండా? ఎమ్మెల్యేలను కాపాడుకోడానికి బీఆర్ఎస్ ఎత్తుగడలు వేస్తోంది. ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కుమారుడి వివాహానికి దాదాపు ఎమ్మెల్యేలందరికీ ఆహ్వానం అందింది. ఈ వివాహం కోసం బాలి వెళ్లిన బీఆర్ఎస్ శాసన సభ్యులతో ట్రబుల్ షూటర్ హరీశ్ రావు కూడా జాయిన్ అయ్యారుబీఆర్ఎస్‌కు ప్రతిపక్ష హోదా లేకుండా చేయాలనే ఏకైక టార్గెట్‌తో ఆపరేషన్ ఆకర్ష్ చేపట్టిన కాంగ్రెస్? ఇప్పటివరకు 10 మంది ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ కండువాలు కప్పింది. ఇంకా 16 మంది ఎమ్మెల్యేలను హస్తం గూటికి రప్పించేందుకు సామ దాన బేధ దండోపాలయాలను ప్రయోగిస్తోంది. ఐతే కొందరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌పై విముఖత వ్యక్తం చేయడంతో కొద్దిరోజులుగా బ్రేక్ పడింది. ఇక సీఎం విదేశీ పర్యటన నుంచి తిరిగి రావడంతో రెండో విడత ఆకర్ష్‌కు తెర తీయనున్నట్లు ప్రచారం జరుగుతోంది ఎమ్మెల్యేలు జారిపోకుండా చూసుకునే బాధ్యతను ట్రబుల్ షూటర్ హరీశ్ రావుకు అప్పగించిందని చెబుతున్నారు. అందుకే ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కుమారుడి వివాహానికి ఎమ్మెల్యేలతోపాటుగా బాలి వెళ్లిన హరీశ్ రావు? పార్టీ నుండి ఎవరూ చేజారకుండా అక్కడే వ్యూహరచన మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. ఇకపై ఒక్క ఎమ్మెల్యే కూడా కారు దిగకుండా పకడ్బందీగా స్కెచ్ వేసినట్లు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రలోభాలకు ఎవరూ తలొగ్గొద్దని? భవిష్యత్ మళ్లీ బీఆర్ఎస్‌దేనని ఎమ్మెల్యేలకు భరోసా ఇస్తున్న హరీశ్ రావు? పార్టీని వీడనున్నారని అనుమానం ఉన్న వారితో బాలిలోనే ప్రత్యేకంగా చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. హరీశ్ రావు భరోసాతో అటూ ఇటుగా ఉన్న ఎమ్మెల్యేలు సైతం కారులోనే కొనసాగతామని చెప్పినట్లు తెలుస్తోందిఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కుమారుడి వివాహం కోసం హరీశ్‌రావుతో పాటు మెజారిటీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వెళ్లినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా చర్చించిన హరీశ్ రావు కాంగ్రెస్ ఎన్నికల హామీలు అమలు చేయలేదని?. ఇప్పటికే ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకతతో కనిపిస్తున్నందున పార్టీ మారి తప్పు చేయొద్దని ఎమ్మెల్యేలకు నచ్చజెబుతున్నట్లు సమాచారం.ఇక మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కోసం కండువాలు తెప్పించిన కాంగ్రెస్ నేతలు.. ఎమ్మెల్యేలు బాలి నుంచి ఎప్పుడు తిరిగి వస్తారా? అని ఎదురుచూస్తున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్‌కు 28 మంది ఎమ్మెల్యేలు ఉండగా, వీరిలో 16 మందిని ఎలాగైనా లాగేసి విలీనం చేసుకునేందుకు కాంగ్రెస్ ప్లాన్ చేస్తోంది. ఐతే కాంగ్రెస్ కలలు ఫలించే పరిస్థితి లేదని బీఆర్ఎస్ చెబుతోంది. పార్టీ అగ్రనేతలు కేసీఆర్, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వంటి వారిని టచ్ చేయలేరని? ఇలా పార్టీకి విధేయంగా సుమారు 15 మంది ఉన్నట్లు చెబుతున్నారు. మిగిలిన ఆరేడుగురు ఊగిసలాటలో ఉన్నా? ఆపరరేషన్ బాలి తర్వాత వారు కూడా కారు దిగేందుకు సుముఖంగా లేరని తెలుస్తోంది.

# సీనియర్ లీడర్స్ మిస్సింగ్...

**హైదరాబాద్ :** అధికారంలో ఉన్నన్ని రోజులు పదవులు అనుభవించారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలబడి కార్యకర్తలకు ఏ ఇబ్బంది వచ్చినా ముందుండి ఎదుర్కోవాల్సిన ఈ సీనియర్ నేతలే ఇలా అయితే ఎలా అంటూ భారత రాష్ట్ర సమితి కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు. 2014, 2018 రెండు దఫాలుగా మంత్రి పదవి అనుభవించి, అది కూడా నెంబర్ టూ పొజిషన్ అనుభవించిన ఓ మాజీ మంత్రి ఎప్పుడు పెద్దగా ఎక్కడ యాక్టివ్‌గా కనిపించడం లేదట.ప్రభుత్వంలో ఉన్నప్పుడు అంత చురుగ్గా ఉన్న మంత్రి, ఇప్పుడు కూడా అలాగే ఉంటారనుకున్నారు. అయితే ప్రస్తుతం సైలెంట్‌గా ఉండటం పార్టీలో ఇబ్బందిగా మారిందట. ఇదే గ్రేటర్ హైదరాబాద్ కు చెందిన మరో మాజీ మంత్రి పార్టీ కార్యక్రమాలకు అంటి ముట్టనట్లుగా ఉంటున్నారట. అధికార పార్టీకి సంబంధించి దేనిపైనైనా మీడియా రియాక్షన్ అడిగిన ఇప్పుడేమీ మాట్లాడను అంటూ దాటవేస్తున్నారట. గ్రేటర్ లో మాస్ లీడర్‌గా ఉన్న ఈ నేత ఇప్పుడు ఎందుకు క్లాస్‌గా వ్యవహరిస్తున్నారన్నదీ కార్యకర్తలకు అర్థం కావడం లేదట.ఇక ఉత్తర తెలంగాణకు చెందిన మరో మాజీ అసలు రాజకీయాల్లో ఉన్నారా అనే అనుమానం వచ్చేలా వ్యవహరిస్తున్నారట. ఇక ఖమ్మం జిల్లాకు సంబంధించిన మరో మాజీ మంత్రి ఎన్నికల తర్వాత కనిపించడమే మానేశారట. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన మరో మాజీ మంత్రి, ఇప్పుడు తన కుటుంబానికి మరో టికెట్ దక్కించుకుని ఇద్దరు ఎమ్మెల్యేగా గెలిచారు. అంతకుముందు తొడలు కొట్టి రేవంత్ రెడ్డికి సవాలు విసిరిన ఈ మాజీ మంత్రి, ఇప్పుడు మాత్రం నియోజకవర్గంలో దాటి బయటకు రావడం లేదట.ఇక ఎమ్మెల్యేలుగా గెలిచిన ఇద్దరు మాజీ మంత్రులు కేవలం నియోజకవర్గాలకే పరిమితమై, పార్టీతో తమకేమీ సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారట. మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, శ్రీనివాస గౌడ్, ప్రశాంత్ రెడ్డి, జగదీష్ రెడ్డి, సబిత, సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్ వీరు మాత్రమే తెలంగాణ భవన్‌కు వస్తూ పోతూ.. పార్టీలో యాక్టివ్‌గా కనిపిస్తున్నారు. అంతేకాదు ప్రభుత్వ విధానాలపై ఎప్పటికప్పుడు ప్రెస్ మీట్ పెట్టి తమ వైఖరిని తెలియజేస్తున్నారు.ప్రతిపక్ష పార్టీగా ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూ, అనేక సమస్యలపై జిల్లాల వారీగా అక్కడికక్కడే ప్రభుత్వం నిలదీయండి అంటూ గతంలోనే కేసీఆర్ సీనియర్ లీడర్లు అందరికీ చెప్పారు. అన్నింటికీ తెలంగాణ భవన్ వేదిక కాదు, జిల్లా స్థాయి సమస్యలను జిల్లాకు పార్టీ కార్యాలయాల్లో ప్రెస్‌మీట్ రూపంలో, ఆందోళన కార్యక్రమాల రూపంలో నిరసన తెలుపాలంటూ సూచించారు. కానీ ఈ మాజీ మంత్రులేమో కనీసం కార్యకర్తలకే అందుబాటులో ఉండడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.వీరితోపాటు గత ప్రభుత్వంలో ముఖ్య నేతలుగా ఉన్న వాళ్ళు సైతం సైలెంట్ అయిపోయారు. మీడియా ముందు మౌత్ పీసులుగా తరచూ కనిపించిన ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఎమ్మెల్సీలు కొంతమంది మనకెందుకులే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారట. అధికారంలో ఉంటే పదవులు అనుభవిస్తారు.. అధికారం పోతే అంటి ముట్టనట్టుగా ఉంటారా అన్నట్లుగా కార్యకర్తలు కామెంట్ చేస్తున్నారు.

## దివ్యాంగులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.

వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య.




**దేవరకొండ, ఆగస్టు 18 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** దేవరకొండ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సామాజిక సేవసదన్ భవనంలో జరిగిన వికలాంగుల హక్కులపోరాట సమితి ఆధ్వర్యంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి సీనియర్ నాయకులు శ్రీరామదాసు వెంకటాచారి ఆధ్వర్యంలో ఆదివారం నాడు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విహెచ్ పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య హాజరై మాట్లాడుతూ ఎన్నికల కాలంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తాముఅధికారంలోకి రాగానే వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళకు, బీడీ కార్మికులకు, చేనేత కార్మికులకు 4016 రూపాయలు పెన్షన్, వికలాంగులకు 6016 రూపాయలు పెన్షన్లు తామ అధికారంలోకి రాగానే ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడిచినా రేవంత్ రెడ్డి ప్రభుత్వము ఇంతవరకు పెన్షన్ ఎప్పుడు ఇస్తారనేది స్పష్టత ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిసెంబర్ 9 నుండి ఇస్తానన్న పెంచిన పెన్షన్ ఇవ్వాలని, డిమాండ్ చేశారు. అలాగే బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలని, మిగిలిన మూడు లక్షల మందికి వెంటనే కొత్త పెన్షన్ మంజూరు చేయాలని, ఆగస్టు 28వ తేదీ వికలాంగుల హక్కుల పోరాట దినోత్సవం సందర్భంగా హైదరాబాదులో భారీ సమావేశం నిర్వహించబోతున్నట్లు తెలిపారు. వికలాంగులకు వ్యవసాయ భూమితో సంబంధం లేకుండా సదరం సర్టిఫికెట్ మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పెరిక శ్రీనివాసులు, వి హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము హరికుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు చైతన్య రెడ్డి, హెచ్ పి ఎస్ సీనియర్ నాయకులు చీమల వెంకటేష్ యాదవ్, విహెచ్పిఎస్ నియోజకవర్గ ఇన్చార్జిలు జెల్లా నరసింహ్మా, పచ్చిపాల కృష్ణయ్య, రవీందర్, రామేశ్వరి, ఉద్యోగ సంఘం నియోజకవర్ ఇంచార్జ్ నరసింహ్మా, తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నంలో వివిధ కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి




**ఇబ్రహీంపట్నం అగస్టు 18 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** ఇబ్రహీంపట్నం మున్సిపల్ పరిధిలోని (టౌన్) బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన ఎన్ ఆర్ గార్డెన్స్ ను ఆదివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గార్డెన్స్ లోని వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా తూర్పు జేఏసీ చైర్మన్ దివంగత వేదిరే చెల్మారెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ చల్మారెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని, తెలంగాణా కోసం పోరాడిన ప్రతి ఉద్యమ కారుణ్ణి కంటికి రెప్పలా ఈ ప్రజాప్రభుత్వం కాపాడుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్త కురుమ మంగమ్మ, శివకుమార్, ఆరుట్ల గ్రామ మాజి సర్పంచ్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర జిల్లా,నియోజకవర్గ, మండల, మున్సిపల్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నందివనపర్తిలో ప్రజయ్ నూతన టెంట్ హౌస్ ప్రారంభోత్సవం

ప్రారంభోత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాధగోని జంగయ్య గౌడ్



**యాచారం, ఆగస్టు 18 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** యాచారం మండలం నంది వనపర్తి గ్రామంలో స్వయం ఉపాది కోసం తన స్నేహితుడు పంది జయరాజ్ ఏర్పాటు చేసుకున్న ప్రజయ్ టెంట్ హౌస్ షాప్ ప్రారంభోత్సవానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాధగోని జంగయ్య గౌడ్.ఈ సందర్భంగా పంది జయరాజ్ జంగయ్య గౌడ్ ను శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జంగయ్య గౌడ్ మాట్లాడుతూ తన స్నేహితుడు పంది జయరాజ్ వ్యాపారంలో ఆర్థికంగా బాగా ఎదగాలని ఆ దేవుడిని కోరుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు నూకం ముదిరాజ్ జయరాజ్ తల్లిదండ్రులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లి మండలం తక్కలపల్లి గ్రామంలో తొలి బహుజన విప్లవ వీరుడు కౌండిన్య సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతిని పురస్కరించుకొని పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా జయంతి ఉత్సవాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ముద్దం సత్తెమ్మ మారయ్య గౌడ్, సాయిరెడ్డిగూడెం తాజా మాజీ సర్పంచ్ కేశగొని రవీందర్ గౌడ్,గౌడ సంఘం నాయకులు పోతగోని రామస్వామి గౌడ్ , ముద్దం రవీందర్ గౌడ్ , శ్రీనివాస్ గౌడ్, పరమేష్ గౌడ్, యాదయ్య గౌడ్, చింతపల్లి శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, యువకులు ఆనంద్ గౌడ్,శివప్రసాద్ గౌడ్, శివకుమార్ గౌడ్,జగన్ గౌడ్, గౌడ సంఘ పెద్దలు, బహుజన నాయకులు, గ్రామ ప్రజలు యువకులు పాల్గొన్నారు.

**ఫోటో రైట్ అప్ :చింతపల్లి ఆగస్ట్ 18 శాసనసభ న్యూస్:**

# దుర్గయ్య హ్యాట్సాఫ్...

**కరీంనగర్ :** సమాజంలో ఎంతోమంది సమాజ సేవకులను చూసే ఉంటాం. రకరకాల సేవా సంస్థల పేరుతో సమాజంలో నిరుపేదలకు సహాయం చేసేందుకు నిత్యం ఏదో ఒక రకమైన కార్యక్రమం పేరుతో కొంతమంది సమాజ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. సమాజ సేవ అంటే జన్మదిన సందర్భంగా రక్తదానం చేయడం అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం లేక సైకిళ్లను పంచి పెట్టడం లేదా దుస్తులను పంచిపెట్టడం చేస్తుంటారు. ఇలాంటివన్నీ కూడా సామాన్యం గా ఏవైనా స్వచ్ఛంద సేవా సంస్థలు లేక మధ్యతరగతి పై కుటుంబాలు ధనిక కుటుంబాలు చేస్తుంటారు. అయితే ఇతను మాత్రం వీరందరిలా కాదు రోడ్లపై ఎక్కడైనా గుంతలు కనిపించాయంటే చాలు వెంటనే ఓ ఆటోలో మట్టిని నింపి తీసుకొచ్చి ఆ గుంతను పూడ్చేస్తారు. ఇలా గత 15 సంవత్సరాలుగా చేస్తున్నాడు. నిరుపేద కుటుంబంలో జన్మించి ఆటో డ్రైవర్ గా జీవనం కొనసాగిస్తున్న ఆ వ్యక్తి ఎవరో తెలుసుకోవాలంటే మాత్రం ఈ స్టోరీ చదవాల్సిందే. కరీంనగర్ జిల్లా చొప్పదండి గ్రామానికి చెందిన అడ్లూరి దుర్గయ్య ఆటో డ్రైవర్ గా జీవనం కొనసాగిస్తున్నారు. ఆయనకు సమాజసేవపై మక్కువ ఎక్కువ అందువల్లే రోడ్లపై ఎక్కడైనా చిన్న గుంత కనిపించింది అంటే చాలు వెంటనే తన ఆటోను తీసుకుపోయి ఓ గడ్డపార, ఓ పార సాయంతో తానే మట్టిని ఆటోలో నింపుకొని ఆ గుంతలను పూడ్చేస్తాడు. అయితే చొప్పదండి ధర్మారం ప్రాంతంలో క్వారీలు అధికంగా ఉండడం లారీలు తిరగడంతో రోడ్లు పూర్తిగా పాడవుతున్నాయి. ఈ క్రమంలో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. నిత్యం వందల సంఖ్యల్లో ప్రయాణించే ఈ రోడ్డుపై నిరుపేదలు కూడా ప్రయాణిస్తుంటారు తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు యోచిస్తుంటారు. అయితే తన కళ్ళ ముందు ఎన్నో ప్రమాదాలు చూసి తట్టుకోలేక పోయారు దుర్గయ్య. ప్రమాదాల్లో మరణించిన వారి పార్థివ దేహాలను కూడా కొంతమంది నిరుపేదలవి ఆయనే పూడ్చి పెట్టారట. వడ్లూరి దుర్గయ్య చొప్పదండి గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా ఆటో ట్రాలీ నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని ఆయనకు సంతానం ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆ ఆటో నడుపుతూనే వారిని ప్రయోజకుల చేశారని గ్రామస్తులు తెలిపారు. అయితే చొప్పదండి చుట్టుపక్కల గ్రామాలలో ఎక్కడ గుంతలు కనిపించిన వాటిని తన సొంత ఖర్చుతో ఆ గుంతలను పూడుస్తారని ఎలాంటి లాభాన్ని ఆశించకుండా ఇలా గత 15 సంవత్సరాలుగా చేస్తున్నారని అంటున్నారు గ్రామానికి చెందిన ప్రసాద్. ఎలాంటి లాభాన్ని ఆశించకుండా సమాజం కోసం తన వంతు సహాయంగా కృషి చేస్తున్న ఇలాంటి వ్యక్తులను ప్రోత్సహించాలన్నారు. అయితే ఈ రోడ్లను పూడ్చడం ప్రభుత్వం పని అయినా తాను రోడ్లపై జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని తన వంతు కృషి చేస్తున్నారని అంటున్నారు గ్రామస్తులు. గత 15 సంవత్సరాలుగా దుర్గయ్య చేస్తున్న సమాజ సేవను గుర్తించిన కొంతమంది సమాజ సేవకులు ఆయనను సన్మానిస్తున్నారు. అయితే ప్రస్తుతం దుర్గయ్య ఆటో పాడైపోయే స్థితిలో ఉంది, కావున ఎవరైనా దుర్గయ్యను ఆదుకోవాలని.. ఆయనను ఎవరైనా ఆదుకుంటే సమాజం కోసం కృషి చేస్తారని గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు. మరి మనం కూడా ఈ పెద్దాయన చేస్తున్న సేవకు ఒక హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే.

# ఉద్యమాలకు కేరాఫ్‌గా వరంగల్

**వరంగల్ :** ఉద్యమాలకు కేరాఫ్‌గా ఉన్న వరంగల్లో మరో ఉద్యమం మొదలవుతుంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత జిల్లాల పునర్విభజన జరిగింది. అయితే వరంగల్ నగరాన్ని రెండు జిల్లాలుగా విభజించారు. నగరాన్ని ఏకం చేయాలనే ఉద్యమం మొదలైంది.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత 2016 అక్టోబర్ 11వ తేదీన అప్పటి ప్రభుత్వం వరంగల్ జిల్లాను ఐదు జిల్లాలుగా విభజించింది. వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, మహబూబాబాద్, భూపాల్ పల్లి జనగామ జిల్లాలుగా పునర్వి భజన జరిగింది. వరంగల్ నగరంతో పాటు కరీంనగర్, వరంగల్ సరిహద్దు ప్రాంతాలను కలుపుకొని వరంగల్ అర్బన్ జిల్లాగా ఏర్పాటు అయింది. వరంగల్ కార్పొరేషన్ పరిధితో పాటు చుట్టుపక్కల గ్రామాలు వరంగల్ అర్బన్ జిల్లా పరిధిలో కొనసాగాయి. 2021వ సంవత్సరంలో మరోసారి జిల్లాల చేర్పులు మార్పులు చేసి వరంగల్ అర్బన్ ను హన్మకొండగా, వరంగల్ రూరల్ ను వరంగల్ జిల్లాగా మార్చారు. కాకతీయు ల రాజధాని వరంగల్ అనగానే త్రినగరి గుర్తుకొస్తుంది. హనుమకొండ, వరంగల్, కాజీపేటలను కలుపుకొని వరంగల్ ను త్రినగరిగా పిలుస్తారు. చారిత్రక కట్టడాలు, అనేక ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలతో పాటు జిల్లా, ప్రాంతీయ కార్యాలయాలకు వరంగల్ నగరం నిలయం. 2016 అక్టోబర్ 11వ తేదీన జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా వరంగల్ నగరాన్ని వరంగల్ అర్బన్ జిల్లాగా మార్చారు. దీంతో వరంగల్ నగర అస్తిత్వానికి వచ్చిన ప్రమాదం ఏమీ లేదు సిటీ అంతా ఒకే పరిధిలో ఉండడంతో అందరూ హ్యాపీగా ఫీలయ్యారు.జిల్లాల మార్పులు చేర్పు?ల్లో భాగంగా 2021 ఆగస్టు 21న వరంగల్ అర్బన్ జిల్లాను హన్మకొండ జిల్లాగా మార్చడం జరిగింది. పేరు మార్పుతో వచ్చిన సమస్యే లేదు. కానీ వరంగల్ నగరం మొత్తం వరంగల్ అర్బన్ జిల్లా పరిధిలో ఉండేది. అర్బన్ పేరు మార్పుతో పాటు నగరాన్ని రెండు ముక్కలుగా చేసి హనుమకొండ జిల్లాగా.. వరంగల్ రూరల్ ను వరంగల్ జిల్లాగా మార్చారు. ఏకశిల నగరాన్ని రెండు ముక్కలు చేసి హనుమకొండ, వరంగల్ జిల్లాలుగా చేసింది అప్పటి ప్రభుత్వం. దీంతో వరంగల్ అస్తిత్వానికి దెబ్బ పడింది.




శ్రీనగరిగా ఉన్న వరంగల్ నగరాన్ని రెండు ముక్కలు చేయడంతో నగరవాసులతో పాటు మేధావులు విద్యావంతులు తీవ్రంగా వ్యతిరేకించారు కానీ ఫలితం లేదు. హనుమకొండ, కాజీపేట ప్రాంతంతో హనుమకొండ జిల్లాగా... వరంగల్ ప్రాంతం, హనుమకొండలోని కొత్త ప్రాంతాన్ని వరంగల్ జిల్లాగా ప్రకటించారు. దీంతో గ్రేటర్ వరంగల్ పరిధితో పాటు చారిత్రక ఏకశిల నగరం రెండు ముక్కలు ముక్కలైంది. చారిత్రక నగరానికి వచ్చే అధితులు, పర్యాటకులు ఇటు పోతే హనుమకొండ జిల్లా, అటుపోతే వరంగల్ జిల్లా ఏంటని ఆశ్చర్యానికి గురవుతున్నారు.వరంగల్ మహా నగరం అస్తిత్వం కోల్పోతుండడంతో వరంగల్ నగరం ఒకే జిల్లాగా ఉండాలనే పోరాటం మొదలైంది. మహానగరం ఏకీకరణ, పునర్నిర్మాణ కమిటీ పేరుతో ఉద్యమాన్ని ప్రారంభించారు. నగర పరిధిలోని మేధావులు విద్యావంతులు మాజీ ప్రజాప్రతినిధులు కలిసి ఉద్యమాన్ని మొదలుపెట్టారు. ఈ ఉద్యమ కమిటీ లక్ష్యం త్రినగరిగా, ఏకశిల నగరంగా పేరున్న వరంగల్ నగరాన్ని ఒకే జిల్లా పరిధిలోకి తేవాలని వీరి పోరాటం. నగర పరిధిలోని మేధావులు, విద్యావంతులు, వ్యాపారులు, విద్యార్థులు, నగర పౌరులను కలుపుకొని ఉద్యమాన్ని ఉధృతం చేయాలని మహానగర ఏకీకరణ కమిటీ ముందుకు వెళు ్తంది.నగరం ఒకే జిల్లాలో ఉండడం వల్ల విద్యాపరంగా వ్యాపార పరంగా అభివృద్ధి చెందడంతో పాటు హైదరాబాద్ తర్వాత పెద్ద నగరంగా వెలుగొందుతుందని కమిటీ సభ్యులు చెప్పారు ఏకీకరణ కోసం నగరంలో ఉన్న ప్రతి పౌరుని విద్యావంతుని మేధావుని మద్దతు తీసుకుంటున్నామని ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళ్తామని కమిటీ భాద్యులు సంపత్ రెడ్డి, యాదవరెడ్డి, పెద్ది వెంకట్ నారాయణ చెప్పారు.

# తెర మీదకు సివిక్ వలంటీర్లు

**కోల్‌కత్తా :** ప్రపంచంలోనే అత్యంత గొప్పదైన రాజ్యాంగాన్ని కలిగి ఉన్న దేశం మనది. నిలువెల్లా ప్రజాస్వామ్యస్ఫూర్తిని ప్రదర్శించే దేశం మనది. లౌకికత్వం, భిన్నత్వంలో ఏకత్వం వంటి విభిన్నతలను కలిగి ఉన్న భూ భాగం మనది.. అలాంటి మనదేశంలో ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు జరుగుతాయి. ప్రజలు ఓటు వేసి గెలిపించిన వారు అధికారులకు వస్తారు. ఐదు సంవత్సరాలపాటు ప్రజా సేవ చేస్తారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. అధికారం దక్కిన తర్వాత ప్రజాప్రతినిధుల వ్యవహారశైలి పూర్తిగా మారిపోతోంది. దోచుకోవడం, దాచుకోవడం పరిపాటిగా మారిపోతుం ది. గిట్టని వారిపై దాడులు చేయడం, నచ్చని వారి గొంతును నొక్కడం సర్వ సామాన్యమైపోతోంది. అంతేకాదు అధికారాన్ని మరింత సుస్థిరం చేసుకునేందుకు పరిపాలకులు ఎంతటి దారుణానికైనా తెగిస్తున్నారు.. చివరికి రాజ్యాంగానికి వ్యతిరేకంగా పరిపాలన సాగిస్తున్నారు. వెనుకటికి రాజులు, చక్రవర్తులు, నియంతలు ఏర్పాటు చేసుకున్నట్లు.. సొంతంగా వ్యవస్థలను ఏర్పాటు చేసుకుంటున్నారు. అయితే వీరికి ప్రభుత్వం నుంచే వేతనాలు ఇస్తుండడం గ్ర్భ్యాంతికి గురిచేస్తోంది. ఇక ప్రస్తుతం మన దేశంలో ఈ తరహా పరిపాలన సాగిస్తున్న వారి సంఖ్య పెరిగిపోతుంది.. ఏపీలో 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ సమయంలో ఆయన జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేశారు. అవి ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెట్టాయి. దీంతో 2019 ఎన్నికల్లో ప్రజలు టిడిపికి అధికారాన్ని దూరం చేశారు. అదే సమయంలో 151 సీట్లతో వైసిపికి తిరుగులేని అధికారాన్ని కట్టబెట్టారు. జగన్ కూడా వాలంటీర్ల పేరుతో ఒక వ్యవస్థను ఏర్పాటు చేశారు. పింఛన్ల పంపిణీ నుంచి మొదలుపెడితే అనేక విధులను వారికి అప్పగించారు. వారు ఒక రకంగా అనధికారిక వైసీపీ కార్యకర్తలు లాగా పని చేశారు. వాలంటీర్ల వ్యవస్థను ప్రభుత్వం గొప్పగా చెప్పుకున్నప్పటికీ.. చివరికి ఆ వ్యవస్థ జగన్మోహన్ రెడ్డికి 2024 ఎన్నికల్లో అధికారాన్ని దూరం



చేసింది. ఇక ఇప్పుడు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో మమతా బెనర్జీ సివిక్ వాలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తున్నారు. ఆ వ్యవస్థ పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో అనధికారిక తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలకు మించి పని చేస్తోంది. కోల్ కతా లోని ఆర్ జీ కార్ ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం జరిగిన తర్వాత ఒకసారిగా ఈ సివిక్ వాలంటీర్ తెరపైకి వచ్చింది. దాని గురించి తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది. దీనిపై అక్కడి ప్రతిపక్ష నాయకులు తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.సివిల్ వాలంటీర్లకు రాత పరీక్ష ఉండదు. ఇంటర్వ్యూ కూడా ఉండదు. వారిని ట్రాఫిక్ గార్డులుగా, పోలీస్ స్టేషన్లో వద్ద కాపలదారులుగా మాత్రమే నియమించినట్టు మమత ప్రభుత్వం ప్రకటించింది. ప్రధాన పండుగ సమయంలో ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించడం, అనధికారికంగా పార్కు చేసిన వాహనాలను తొలగించడం, పోలీసులకు సంబంధించిన అధికారిక విధుల్లో సహకరించడం, ప్రజా భద్రతను పర్యవేక్షించడం, అధికారులు చెప్పిన పనులు చేయడం వీరి ప్రాథమిక విధుల్లో కొన్ని. కానీ సంజయ్ రాయ్ అనే వ్యక్తిని సివిల్ వాలంటీర్ గా విధుల్లోకి తీసుకున్నాడు. అతడు తనకున్న అధికారంతో ఆర్జీ కార్ ఆసుపత్రిలోని అన్ని విభాగాల్లోకి వెళ్లే అవకాశాన్ని పొందాడు. ఇదే సమయంలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడ్డాడు. అసలు ఈ వ్యవస్థ అత్యంత దారుణమైందని" సిపిఎం నేత సృజన్ చక్రవర్తి ఆరోపిస్తున్నారు." రాత పరీక్ష ఉండదు. ఇంటర్వ్యూలు కూడా ఉండవు. సివిక్ వాలంటీర్ గా పనికి వస్తాడని అధికార పార్టీ నేతల నిర్ణయిస్తారు. వారే ఒక జాబితాను విడుదల చేస్తారు. ఆ తర్వాత వారి నియామకం జరిగిపోతుంది. ఇలా ఎంపికైన వారిపై గతంలో అనేక కేసులు నమోదయ్యాయి. బెంగాల్ రాష్ట్రంలో పోలీసులను కూడా నియంత్రించే స్థాయికి సివిక్ వాళ్లటీర్ల వ్యవస్థ ఎదిగిందని" సృజన్ చక్రవర్తి చెబుతున్నారు.. మరోవైపు సంజయ్ రాయ్ పై గతంలో గృహహింసకేసు నమోదయిందని, కానీ అతడు సివిక్ వాలంటీర్ కావడంతో పోలీసులు అరెస్ట్ చేయలేదని సృజన్ పేర్కొన్నారు.ఇక విద్యార్థి ఉద్యమ కార్యకర్త అనిస్ ఖాన్ అనే యువకుడు 2022లో హత్యకు గురయ్యాడు. ఆ సమయంలో అతని హత్య వెనుక సివిక్ వాలంటీర్ ఉన్నట్టు పోలీసుల విచారణలో తేలింది. ఆ సమయంలో ఆ వ్యవస్థను మొత్తం రద్దు చేయాలని అప్పటి అడ్వకేట్ జనరల్ గోపాల్ ముఖోపాధ్యాయ అంతర్గతంగా వ్యాఖ్యానించడం ప్రకంపనలు కలిగించింది. ఆ తర్వాత అది తన వ్యక్తిగత అభిప్రాయమని ఆయన సవరించే ప్రయత్నం చేశారు. ఇక ఇటీవల ఒక ఓ డ్రైవర్ కు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి సివిక్ వాలంటీర్ అతడి వద్ద నుంచి 11,370 రూపాయలు లంచంగా తీసుకున్నాడు..కోల్ కతా లోని లేక్ కాళీ బరీ ఆలయంలో వాహనాలకు పూజ చేయిస్తే కచ్చితంగా అక్కడి సివిక్ వాలంటీర్లకు కచ్చితంగా 100 లేదా 200 ఇవ్వాల్సిందే. ఇక సివిక్ వాలంటీర్లను స్వచ్ఛంద సేవకులుగా పేర్కొంటున్న ప్రభుత్వం.. హోం శాఖ నుంచి వారికి ప్రతినెల జీతాలు చెల్లిస్తోంది. వారిని పోలీసులతో కలిపి తిప్పుతోంది. రాష్ట్రంలో శాంతిభద్రతను పర్యవేక్షించేందుకు వారిని కూడా భాగం చేస్తోంది. దీనిపట్ల పోలీసులు అంతర్గతంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నప్పటికీ..పై బాస్ లు మొత్తం అధికార పార్టీకి తొత్తులు కావడంతో ఏమీ అనలేని పరిస్థితి.. ఇలాంటి వ్యవస్థతో ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టిస్తున్న మమతా బెనర్జీ లాంటివాళ్ళ్ళ.. దీదీ గా అభివర్ణించుకోవడం గమనార్హం. ఇదే సమయంలో బెంగాల్ ప్రజలు చేసుకున్న పాపం.

## హైడ్రా... బుల్డోజర్లు..వచ్చేస్తున్నాయ్....

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో ఆక్రమణదారులకు వణుకు మొదలయింది. "హైడ్రా" దూకుడుతో అక్రమ నిర్మాణాలను కూల్చి వేస్తున్నారు. దీంతో ఇన్నాళ్లూ చెరువు స్థలాలను, ప్రభుత్వ భూములను కబ్జా చేసేసి ఆక్రమించుకుని ఆకాశహర్మ్యాలు కట్టిన బిల్డర్ల తాట తీస్తున్నారు. అక్రమ నిర్మాణం అని తేలితే చాలు వెంటనే కూల్చి వేస్తున్నారు. అక్రమంగా కట్టడాన్ని నిర్మిస్తే చాలు వాటిని కూల్చివేసేందుకు సిద్ధమయ్యారు హైడ్రా అధికారులు. హైదరాబాద్ మహానగరంలో చెరువుల భూములను, ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వాటిని నేలమట్టం చేస్తున్నారు. ఒక్క సమాచారం ఎవరు ఇచ్చినా వెంటనే అక్కడకు వాలిపోయి కూల్చివేతలను ప్రారంభిస్తున్నారు.వానఅక్రమ నిర్మాణాలను... ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, పార్క్ స్థలాలు, బఫర్ జోన్లలో అక్రమనిర్మాణాలను కూల్చి వేసేందుకు "హైడ్రా"ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. హడ్రా అంటే హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్ట్ ఏజెన్సీ గా నామకరణం చేశారు. అక్రమ నిర్మాణాలపై కొరడా ఝులిపించేందుకు ఈ సంస్థక ఛైర్మన్ గాముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తారు. హైడ్రా కమిషనర్ గా సీనియర్ ఐపీఎస్ అధికారి రంగనాథ్ నియమితులయ్యారు. ఇక చూస్కోండి. అప్పటి నుంచి హైడ్రాకు పదుల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయి.వాటిని మ్యాప్ ద్వారా పరిలించి ఆక్రమణలు అన్న తేల్చుకున్న తర్వాతనే వాటినికూల్చి వేస్తున్నార.. హైడ్రా ఛైర్మన్ రేవంత్ రెడ్డికూడా ఈవిషయంలో సీరియస్ గాఉండటంతో ఆయన వద్దకు వెళ్లి పైరవీలు చే?సేందుకు అవకాశం లేదు. రేవంత్ రెడ్డి హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో ఆయన ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు కొన్ని రోజులుగా ప్రయత్నిస్తున్నారు. పోలీసులతో సమన్వయం చేసుకుని ఈ కూల్చివేతలు కొనసాగుతున్నాయి. రాత్రి పన్నెండు గంటలకు మొదలెట్టి న్యాయస్థానాలను ఆశ్రయించకుండా హైడ్రా అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. తాజాగా బాచుపల్లిలో ఉన్న మల్టీ ప్లెక్స్ భవనాన్నికూల్చి వేశారు. అంతేకాదు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పై పోలీసులు కేసు నమోదు చేశారు. దానం నాగేందర్ రంగనాథ్ పై కొంత పరుష వ్యాఖ్యలు చేసినా ఆయన పెద్దగా పట్టించుకోలేదు. సో.. మీ ప్రాంతంలో ఆక్రమణలున్నాయా? అయితే వెంటనే హైడ్రాకు ఫిర్యాదు చేయండి. ప్రభుత్వ స్థలాలు రక్షించినవారవుతారు

## క్రమబద్ధీకరణకు గ్రీన్ సిగ్నల్



**హైదరాబాద్ :** పొలిటికల్‌గా రచ్చరేపిన ఎల్‌ఆర్ఎస్ విషయంలో ఎట్టకేలకు ముందడగు పడింది. 2020లో క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వాళ్లకు మరో అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పేక మేడలు కాదు. ఇల్లీగల్ కన్‌స్ట్రక్షన్స్. నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ కట్టడాల కూల్చివేతల పర్వం మొదలైంది. హైడ్రా ఆపరేషన్ అక్రమార్కుల వెన్నులో వణుకు పుట్టిస్తోంది.మరోవైపు లే-అవుట్ రెగ్యూలరైజేషన్ స్కీమ్.. ఎల్‌ఆర్ఎస్ పై తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. లే అవుట్స్, ప్లాట్స్ క్రమబద్ధీకరణకు మరో ఛాన్స్ ఇచ్చింది. కాకపోతే కండీషన్స్ అప్లయ్. 2020 అక్టోబర్ 15లోపు దరఖాస్తు చేసుకున్న వాళ్లకే క్రమబద్ధీకరణ అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు సంబంధిత అధికారులు. 131, 135 జీవో నెంబర్ల ప్రకారం రాష్ట్రాల అక్రమ లే-అవుట్స్, ప్లాట్స్ రెగ్యూలరైజషన్ కోసం 2020లో నియమ నిబంధనలు జారీ అయ్యాయి.2020 ఆగస్టు26 కన్నా ముందు రిజిస్టర్ చేసిన లే అవుట్లకు మాత్రమే ఎల్‌ఆర్ఎస్ వర్తిస్తుందని స్పష్టం చేశారు. గైడ్‌లైన్స్ 2020లోనే విడుదలైనా దరఖాస్తుల పరిశీలన గత జనవరి నుంచే మొదలైంది. ఇప్పటి వరకు 4లక్షల 28వేల 832 అప్లికేషన్లను స్క్రూట్నీ చేశారు. 60 వేల 2వందలకు పైచిలుకు దరఖాస్తులకు ఆమోద ముద్ర పడింది. తద్వారా ఫీజుల రూపేణ సర్కార్ ఖజానాలో 96 కోట్ల 60 లక్షలు జమయ్యాయిమరి మిగతా అప్లికేషన్ల మాటేంటి? దాదాపు 75 శాతం దరఖాస్తులకు ఆమోద ముద్రం పడకపోవడానికి కారణం..సరైన డాక్యుమెంట్లు సమర్పించకపోవడం..సమగ్ర వివరాలు పొందుపర్చకపోవడం.అలాంటి వారికి ఇప్పుడు మరో అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సేల్ డీడ్, ఈసీ, మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్ , లే-అవుట్ కాపీలను జతపరిస్తే మళ్లీ ఆ దరఖాస్తులను పరిశీలిస్తారు. మొబైల్ ద్వారా కూడా డాక్యుమెంట్స్‌ను అప్‌లోడ్ చేయవచ్చు. లేదంటే మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ ఆఫీసుల్లో స్వయంగా ఇవ్వొచ్చు. సలహాలు సూచనల కోసం హెల్ప్ డెస్క్‌లను కూడా ఏర్పాటు చేశారు అధికారులు.కాంగ్రెస్ సర్కార్ అధికార పగ్గాలు చేపట్టిన కొత్తలోనే ఎల్‌ఆర్ఎస్ పై రాజకీయ రచ్చ రాజుకుంది. అధికారంలోకి రాగానే ల్యాండ్ రెగ్యూలరైజేషన్‌ను ఫ్రీగా చేస్తామన్న హామీని నిలపెట్టుకోవాలని బీఆర్ఎస్ ఆందోళనలు చేపట్టింది. మరోవైపు, మాటేంటే మాటేనన్న కాంగ్రెస్ సర్కార్ ఎల్ ఆర్ ఎస్ అమలు కోసం విధి విధానాలపై ఫోకస్ పెట్టింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ మినిస్టర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఎల్‌ఆర్ఎస్ కోసం దాఖలైన దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాల వారీగా స్పెషల్ టీమ్స్‌ను ఏర్పాటు చేసుకోవాలని.. సిబ్బంది కొరత వుంటే ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్‌పై తీసుకోవాలని సూచించారు. మొత్తానికి దరఖాస్తుల పరిశీలన పూర్తయింది. 60 వేల 2వందల అప్లికేషన్లకు ఆమోదం లభించింది. మిగతా వారికి మరో అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఐతే 2020 అక్టోబర్ 15లోపు దరఖాస్తు చేసుకున్న వాళ్లకే క్రమబద్ధీకరణ అవకాశం కల్పించారు.

## భారీగా పెరగనున్న రేషన్ డిపోలు

**కాకినాడ :** ఏపీలోని కూటమి ప్రభుత్వం రేషన్ షాపులపై ప్రత్యేక దృష్టిపెట్టింది. ఇప్పటికే కొత్త కార్డుల జారీపై కసరత్తు షురూ చేయగా... దుకాణాల సంఖ్యను కూడా పెంచాలని నిర్ణయించింది. లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా కొత్తగా 4 వేల పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది.కొత్త రేషన్ కార్డుల జారీకి ఆంధ్రప్రదేశ్ లో రంగం సిద్ధమవుతోంది. దీనికి సంబంధించిన డిజైన్లను పౌరసరఫరాల శాఖ పరిశీలించే పనిలో పడింది. త్వరలోనే ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేసే అవకాశం ఉంది. ముందుగా కొత్తగా పెళ్లైన వారికి త్వరితగతిన కార్డులను పంపిణీ చేస్తారని సమాచారం. ఇదిలా ఉంటే? రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది.రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పంపిణీ కేంద్రాలను పెంచాలని సర్కార్ నిర్ణయించింది. రేషన్ పంపిణీ మరింత సజావుగా సాగడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 29 వేలకుపైగా రేషన్ దుకాణాలు ఉండగా?. కొత్తగా మరో 4 వేల కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సిద్ధమైంది. నిర్దేశిత సమయంలో లబ్ధిదారుడికి రేషన్ అందించటమే లక్ష్యంగా ముందుకు సాగాలని నిర్ణయించింది. ఎక్కువ రేషన్ కార్డులు ఏ పరిధిలో ఉంటే అక్కడ ఈ కేంద్రాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. దీనిపై పౌరసరఫరాల నుంచి ప్రకటన వస్తుంది.ప్రస్తుతం ఉన్న రేషన్ దుకాణాల్లో కొన్నింటికి ఇన్‌ఛార్జ్ డీలర్లు ఉన్నారు. అయితే ఇలాంటి పరిస్థితులు ఎక్కడైతే ఉన్నాయో? వాటిని గుర్తించాలని సర్కార్ నిర్ణయించింది. త్వరితగతిన ఆయా ఖాళీలను కూడా భర్తీ చేసే చర్యలను ప్రారంభించనుంది. ప్రాథమిక వివరాల ప్రకారం? 6 వేలకుపైగా డీలర్ల ఖాళీలు ఉన్నట్లు గుర్తించారుకొత్త రేషన్ కార్డుల డిజైన్లను పరిశీలిస్తున్న పౌరసరఫరాల శాఖ?త్వరలోనే తుది డిజైన్ ను ఖరారు చేయనుంది. ఆ వెంటనే కార్డుల జారీ కోసం ప్రకటన వెలువడనుంది. అయితే ఇకపై రేషన్ కార్డు తీసుకోవాలనుకునే కొత్త జంట.. తప్పనిసరిగా మ్యారేజీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ను సమర్పించాల్సి ఉంటుంది. ఇటీవలే ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా రేషన్ కార్డుల జారీపై కీలక ప్రకటన చేశారు. కొత్త కార్డులను డిజైన్ చేసే పనిలోనే ఉన్నామని చెప్పారు.

## బిజినెస్

# హెూటళ్లు, హాస్పిటల్స్‌ల్లో లావాదేవీలపై ఐటీ దృష్టి



**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా పెద్దమొత్తంలో జరిగే నగదు లావాదేవీలపై కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు ఆందోళన వ్యక్తంచేసింది. ముఖ్యంగా హెూటళ్లు, లగ్జరీ బ్రాండ్ విక్రయ స్టోర్లు, హాస్పిటళ్లు, ఐవీఎఫ్ క్లినిక్స్‌ల్లో పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలు జరుగుతున్నాయని, వాటిపై దృష్టి సారించాలని ఆదాయ పన్ను మంత్రిత్వ శాఖకు కీలక సూచన చేసింది కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ). 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను సీబీడీటీ విడుదల చేసిన వార్షిక ప్రణాళికలో ఈ విషయాన్ని స్పష్టంచేసింది. సాధారణంగా రూ.2 లక్షలకు పైబడి నగదు లావాదేవీలు జరిగితే ఆ వివరాలు ఆర్థిక సంస్థలకు నివేదించాల్సి ఉంటుందని సీబీడీటీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. కానీ నిబంధనలను అతిక్రమించి పెద్ద మొత్తంలో లావాదేవీలు జరుగుతున్నాయని, వీటిపై ప్రధానంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదని ఐటీ శాఖకు సూచించింది. అలాగే పెద్ద మొత్తంలో జరిగే ఆర్థిక లావాదేవీలకు ఖచ్చితంగా పాన్ కార్డు జత చేయాల్సి ఉండగా, వీరు ఎలాంటి కార్డు వివరాలు ఇవ్వకుండానే జరుపుతున్నారని, దీనివల్ల ఆదాయ పన్ను శాఖకు భారీ నష్టం జరుగుతున్నదని, వీటిని మోస పూరిత లావాదేవీలుగా గుర్తించి వీటిపై చర్యలు తీసుకోవాలని సూచించింది.

## భగ్గుమన్న బంగారం..
## 72 వేలు దాటిన తులం ధర



బంగారం ధర మళ్లీ భగ్గుమన్నది. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు దూసుకుపోవడంతో దేశీయ ధరలు పుంజుకున్నాయి. వచ్చే నెల సమీక్షలో ఫెడరల్ రిజర్వులు వడ్డీరేట్లను అర శాతం వరకు తగ్గించే అవకాశం ఉన్నట్లు వచ్చిన సంకేతాలు మదుపరులు తమ పెట్టుబడులను అతి సురక్షితమైన పుత్తడివైపు మళ్లించారు. దీంతో గ్లోబల్ మార్కెట్లో ఒకేరోజు ఔన్స్ ధర రెండు శాతం వరకు పెరిగాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో తులం పుత్తడి ధర అయితే ఏకంగా రూ.72 వేలు దాటింది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 24 క్యారెట్ పదిగ్రాముల బంగారం ధర రూ.1,150 అధికమై రూ.72,770 పలికింది. అటు 22 క్యారెట్ ధర కూడా రూ.1,050 అధికమై రూ.66,700కి చేరుకున్నది. బంగారంతో పాటు వెండి పరుగులు పెట్టింది. కిలో వెండి రూ.2000 అధికమై రూ.91 వేలు పలికింది. అంతకుముందు ఇది రూ.89 వేలుగా ఉన్నది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ లేకపోయినప్పటికీ ధరలు పెరగడం విశేషం. మరోవైపు పండుగ సీజన్, పెళ్లిళ్ల సీజన్ కావడంతో కొనుగోళ్లు ఊపందుకున్నాయని వ్యాపారస్తులు చెబుతున్నారు.

# జొమాటో నుంచి కొత్త ఫీచర్..
# ఇక ఆ సమస్య తీరినట్టే




ఆకలేస్తే వండుకోనవసరం లేకుండా చిటికెలో నచ్చిన ఆహారాన్ని ఆర్డర్ చేసే సదుపాయం ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థల వల్ల వచ్చింది. మార్కెట్లో ప్రస్తుతం స్విగ్గీ, జొమాటోలదే రాజ్యం. ఈ మధ్య కాలంలో అత్యధిక లాభాలు సాధిస్తున్న జొమాటో యాప్‌లోనూ వినూత్న ఫీచర్లు తీసుకొస్తూ ఆకట్టుకుంటోంది. ఇటీవలే.. యాప్‌తోనే యూపీఐ చెల్లింపులు జరిపే ఫీచర్ తీసుకొచ్చి చిల్లర బాధలు లేకుండా చేసింది. తాజాగా మరో ఫీచర్‌తో ముందుకువచ్చింది. స్నేహితులంతా ఓ చోట చేరితే వారికి ఇష్టాఇష్టాలు ఒక్కో రకంగా ఉంటాయి. ఒక్కొక్కరు ఒక్కో రకమైన ఆహారాన్ని ఇష్టపడుతుంటారు. వారికి ఇష్టమైన ఫుడ్ ఏంటో కనుక్కొని ఆర్డర్ పెడుతుంటారు. అయితే ప్రతీ సారి ఇలా అందరినీ కనుక్కొని ఫుడ్ ఆర్డర్ చేసుకోవడం చాలా ఇబ్బంది ఎదురవుతుంది. ఈ సమస్యను అధిగమించడానికే జొమాటో గ్రూప్ ఆర్డరింగ్ పేరుతో ఓ నయా ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా అందరూ కలిసి నచ్చిన ఫుడ్ ఆర్డర్ చేసేందుకు వీలు కల్పించేలా ఈ ఫీచర్ ఉంది. జొమాటో సీఈవో దీపిందర్ గోయల్ ఫీచర్ విశేషాలను ఎక్స్‌లో తెలిపారు. గ్రూప్ ఆర్డరింగ్ ఫీచర్ సహాయంతో.. ఫుడ్ ఆర్డర్ చేసే సమయంలో కార్ట్‌లో మీ స్నేహితులందరినీ భాగస్వామ్యం చేయొచ్చు. దీని కోసం గ్రూప్ ఆర్డర్‌లో ఉండే లింక్‌ను వారికి పంపాలి. దానితో ప్రతి ఒక్కరూ నచ్చిన ఫుడ్‌ను కార్ట్‌లో యాడ్ చేస్తారు. దీంతో ఎవరికి నచ్చిన ఫుడ్‌ను వారే స్వయంగా ఎంచుకునే అవకాశం లభిస్తుంది. ఇప్పటికైతే ఈ ఫీచర్ కొందరికే అందుబాటులో ఉంది. రానున్న రోజుల్లో అందరు యూజర్లకు అందుబాటులోకి తెస్తామని దీపిందర్ పేర్కొన్నారు.

**నెటిజన్ల మరో రిక్వస్ట్..**

గ్రూప్ ఆర్డర్‌లానే చెల్లింపులను కూడా షేర్ చేసుకునే మరో ఫీచర్‌ను తీసుకురావాలని కొందరు యూజర్లు దీపిందర్‌ని అడిగారు. అయితే త్వరలోనే ఈ ఫీచర్‌ను కూడా తీసుకొచ్చే ఆలోచనలో ఉన్నట్లు గోయల్ చెప్పారు. ఇవన్నీ ఫీచర్లు వినియోగదారులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు సాయపడతాయన్నారు.

# ఒక్కరోజులోనే రూ.82 వేల కోట్లు
# సంపాదించిన 23 మంది వ్యాపారవేత్తలు



భారత స్టాక్ మార్కెట్లు రికార్డు స్థాయి లాభాల్లో ముగిశాయి. దీంతో దేశంలోని పలు కంపెనీల షేర్లు మరింత పుంజుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా కంపెనీలపై పెట్టుబడులు చేసిన మదుపర్లకు ఒక్కరోజే 7.5 లక్షల కోట్ల ఆదాయం లభించింది. ఇక ఆయా కంపెనీల షేర్లను కల్గి ఉన్న ఓనర్ల మరింత సంపద మరింత పెరిగి అపర కుబేరులుగా మారిపోయారు. వారిలో దేశంలోని 25 మంది బిలియనీర్లలో 23 మంది నికర విలువలో 9.84 బిలియన్ డాలర్లు అంటే రూ.8,25,33,73,80,000 కోట్లకు పైగా పెరిగింది. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ డేటా అందుకు సంబంధించిన వివరాలను ప్రకటించింది. భారతీయ బిలియనీర్లలో ప్రధానంగా గౌతమ్ అదానీ నికర విలువలో అత్యధిక పెరుగుదల కనిపించింది. ఆ తర్వాత ముఖేష్ అంబానీ సంపద పెరిగింది. వీరిద్దరి నికర విలువలో ఏకంగా 3.22 బిలియన్ డాలర్లు అంటే 27 వేల కోట్ల రూపాయలకు పైగా పుంజుకుంది. ఇది మొత్తం పెరుగుదలలో మూడో వంతు కావడం విశేషం.

**ఏ బిలియనీర్ సంపద ఎంత పెరిగింది?**

ముఖేష్ అంబానీ సంపద %వి%1.37 బిలియన్లు పెరిగింది. దీంతో ఆయన మొత్తం నికర విలువ %వి%111 బిలియన్లకు చేరుకుంది. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత సంపన్న వ్యాపారవేత్తల్లో అంబానీ 11వ స్థానంలో ఉన్నారు. గౌతమ్ అదానీ సంపదలో 1.85 బిలియన్ డాలర్లు పెరిగాయి. ఆ తర్వాత ఆయన మొత్తం నికర విలువ 104 బిలియన్ డాలర్లుగా మారింది. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత సంపన్న వ్యాపారవేత్తల్లో అదానీ 14వ స్థానంలో ఉన్నారు. షాపూర్ మిస్త్రీ నికర విలువ %వి%978 మిలియన్లు పెరిగింది. ఆ తర్వాత ఆయన మొత్తం నికర విలువ %వి%41.6 బిలియన్లకు చేరుకుంది. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత సంపన్న వ్యాపారవేత్తల్లో షాపూర్ 36వ స్థానంలో కలరు. శివ నాడార్ నికర విలువలో 828 మిలియన్ డాలర్ల పెరుగుదల కనిపించింది. తర్వాత మొత్తం నికర విలువ 38.5 బిలియన్ డాలర్లకు చేరింది. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత సంపన్న వ్యాపారవేత్తల్లో 39వ స్థానంలో ఉన్నారు. సావిత్రి జిందాల్ నికర విలువ 524 మిలియన్ డాలర్లు పెరుగగా, ఆమె మొత్తం నికర విలువ 32.9 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత సంపన్న వ్యాపారవేత్తల్లో 50వ స్థానంలో ఉన్నారు. అజీమ్ ప్రేమ్‌జీ నికర విలువ 906 మిలియన్ డాలర్లు పెరిగింది. ఆ తర్వాత మొత్తం నికర విలువ 28.7 బిలియన్ డాలర్లకు చేరింది. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత సంపన్న వ్యాపారవేత్తల్లో 61వ స్థానంలో కలరు. దిలీప్ షాంఘ్వీ నికర విలువ 79.1 మిలియన్ డాలర్లు పెరుగగా, మొత్తం నికర విలువ 28.6 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత సంపన్న వ్యాపారవేత్తల్లో 63వ స్థానంలో ఉన్నారు.

## స్పోర్ట్స్

# ఆగస్టు 26న యూఎస్ ఓపెన్ ..
# టాప్ సీడ్స్‌కు సవాలేనా?



ప్రతిష్ఠాత్మక యూఎస్ ఓపెన్ త్వరలోనే మొదలవ్వనుంది. ఈ సీజన్‌లో ఆఖరిదైన ఈ గ్రాండ్‌స్లామ్‌కు ఆగస్టు 26న తెర లేవనుంది. ఈసారి పురుషుల, మహిళల విభాగాల్లో కలిపి 128 మంది పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు. నొవాక్ జకోవిచ్ అమెరికా టీనేజర్ కొకో గాఫ్‌లు డిఫెండింగ్ చాంపియన్లుగా బరిలోకి దిగనున్నారు. విజేతలకు రూ.30 కోట్లు, రన్నరప్‌లకు 15 కోట్లు ప్రైజ్‌మనీ దక్కనుంది. ఈ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ అయిన యూఎస్ ఓపెన్ ఉత్కంఠగా సాగనుంది. పురుషుల సింగిల్స్‌లో ఈసారి కూడా తగ్గ పోరు ఖాయమనిపిస్తోంది. ఒలింపిక్స్‌లో స్వర్ణంతో చరిత్ర సృష్టించిన నొవాక్ జకోవిచ్, రజతం సాధించిన కార్లోస్ అల్కారాజ్‌లు ఫేవరెట్లుగా ఆడనున్నారు. మరోవైపు ఇటలీ కెరటం జన్నిక్ సిన్నర్, రష్యా యోధుడు డానిల్ మెద్వెదేవ్ కూడా టైటిల్‌పై గురి పెట్టారు. 25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న జకోవిచ్‌కు ఈ ముగ్గురి నుంచి గట్టి పోటీ ఎదురవ్వనుంది. మహిళల సింగిల్స్‌లో ఇగా స్వియాటెక్ టాప్ సీడ్ దక్కించుంది. అమెరికా సంచలనం కొకో గాఫ్ వరుసగా రెండో టైటిల్ నిలబెట్టుకోవాలనే పట్టుదలతో ఉంది. బెలారస్ టెన్నిస్ స్టార్ అజరెంక, వైల్డ్ కార్డ్‌తో ఎంట్రీ ఇచ్చిన నవోమి ఒసాకాలు కూడా టైటిల్ వేటలో ముందున్నారు.

**నవోమి ఒసాకా**

ఒకప్పుడు యూఎస్ ఓపెన్ విజేతలైన స్టాన్ వావ్రింకా, డోమినిక్ థీమ్, నవామి ఒసాకా, బియంకా అండ్రెస్కులు ఈసారి వైల్డ్ కార్డ్ ఎంట్రీలుగా తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పురుషుల సింగిల్స్‌లు ఆరుగురు వైల్డ్ కార్డ్ ఎంట్రీ సాధించారు. క్రిస్టోఫర్ యుబ్యాంక్స్(అమెరికా), జచారి స్వాజ్డా, లెర్నర్ టియెన్, మాథ్యూ ఫోర్బ్స్, అలెగ్జాండర్ ముల్లెర్(ఫ్రాన్స్), ట్రిస్టన్ స్కూల్‌కేట్(ఆస్ట్రేలియా)లు బరిలోకి దిగుతున్నారు. ఇక రెండుసార్లు యూఎస్ చాంపియన్ అయిన ఒసాకా రెండేండ్ల తర్వాత ఈ టోర్నీలో ఆడనుంది. కాన్పు కోసం బ్రేక్ తీసుకున్న ఆమె ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్‌లో తీవ్రంగా నిరాశపరిచింది.

# నా జీవితంలో పెద్ద గాయం అదే.. వీడ్కోలుపై ఏమీ చెప్పలేను



స్వదేశంలో చాంపియన్ తరహా స్వాగతం చవిచూసిన వినేశ్ ఫొగాట్ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. సొంత ఊరైన బలాలి లో గోల్డ్ మెడల్ స్వీకరించిన ఆమె ఒలింపిక్ పతకం చేజార్చు కోవడం తన జీవితంలో పెద్ద గాయమని అంది. అంతేకాదు రెజ్లింగ్‌ను వదిలేస్తానా? వీడ్కోలును వాపస్ తీసుకుంటానా? అనేది ఇప్పుడే చెప్పలేను అని వినేశ్ తెలిపింది. 'పారిస్ ఒలింపిక్స్‌లో పతకం కోల్పోవడం నా జీవితంలో చాలా పెద్ద గాయం. అయితే.. ఇక్కడ మీ ప్రేమాభిమానుల చూశాక ఆ గాయం నుంచి కోలుకుంటాననే ధైర్యం వచ్చింది. ఇక వీడ్కోలు గురించి అంటారా.. ఇప్పుడే ఏమీ చెప్పలేను. ఇక ఏడాదిన్నర పాటు రెజ్లింగ్ సమాఖ్యపై చేసిన పోరాటాన్ని మళ్లీ కొనసాగిస్తాను' అని వినేశ్ వెల్లడించింది. విశ్వ క్రీడల్లో పతం చేజార్చుకున్న వినేశ్‌కు రెజ్లర్లు బజ్‌రంగ్ పూనియా, సాక్షి మాలిక్‌లు చాంపియన్ తరహాలో స్వాగతం పలికారు. అనంతరం బలాలిలో ఆమె మేనమామ మహవీర్ ఫొగాట్ ఖాప్ పంచాయతీ పెద్దలు వినేశ్‌కు గౌరవ మర్యాదలతో ఆహ్వానించారు. 'ఒలింపిక్ మెడల్ గెలవకున్నా సరే.. నువ్వు ఎప్పటికీ చాంపియన్‌వే' అంటూ ఆమెను ఘనంగా సన్మానించారు. రెజ్లర్‌ను పూల దండలు, తలపాగాతో సన్మానించిన అనంతరం వినేశ్‌కు స్వర్ణ పతకాన్ని అందజేశారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఒలింపిక్స్ పతకంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న వినేశ్ ఫొగాట్ కల చెదిరింది. ఫైనల్ ఫైట్‌కు ముందు 100 గ్రాముల అదనపు బరువుతో ఫైనల్ ఆడలేకపోయిన ఆమె కన్నీటిపర్యంతమైంది. ఆ బాధలోనే రెజ్లింగ్‌కు వీడ్కోలు కూడా చెప్పేసింది. అనంతరం వినేశ్ తనపై వేటు సవాల్ చేస్తూ అర్బిట్రేషన్ కోర్టులో అప్పీల్ చేసింది. అయితే.. మూడు సార్లు తీర్పును వాయిదా వేసిన కాస్ చివరకు పతకం ఇవ్వలేమని చెప్పింది. దాంతో, నిరాశగా వినేశ్ స్వదేశానికి వచ్చేసింది.

# కలల ట్రోఫీ కోసం రెండు నెలలు..
# కమిన్స్ విశ్రాంతికి కారణమిదే..!



బీ ఆస్ట్రేలియా టెస్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఆటకు విరామం ప్రకటిం చాడు. గత కొంతకాలంగా ప్రతి సిరీస్ ఆడుతున్న ఈ స్పీడ్‌స్టర్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. టీ20 వరల్డ్ కప్ ముగియడంతో స్కాట్లాండ్, ఇంగ్లండ్ వన్డే సిరీస్‌కు అతడు దూరమయ్యాడు. అయితే.. స్వదేశంలో టీమిండియాతో జరుగబోయే బోర్డర్ - గవాస్కర్ ట్రోఫీ కోసమే కమిన్స్ బ్రేక్ తీసుకున్నట్టు సమాచారం. దాదాపు 8 వారాలు అంటే రెండు నెలల పాటు ఈ స్పీడ్‌స్టర్ విశ్రాంతి తీసుకోనున్నాడు. తన కెప్టెన్సీలో ఆసీస్‌కు టెస్టు గద, వన్డే వరల్డ్ కప్ అందించిన కమిన్స్.. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ కలను నిజం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. 'ఎవరైనా బ్రేక్ తర్వాత కొంచెం ఫ్రెష్‌గా కనిపిస్తారు. అలాగని ఆటకు దూరమయ్యామని బాధ పడాల్సిందేమీ లేదు. నిరుడు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ నుంచి నేను సుదీర్ఘంగా బౌలింగ్ చేస్తున్నా. 18 నెలలుగా బ్రేక్ తీసుకోలే. ఈ 7-8 వారాల విశ్రాంతి నాకు ఎంతో ఉపయోగపడనుంది. నా శరీరం కూడా మెరుగవుతుంది. దాంతో, ఈ వేసవిలో మళ్లీ చెలరేగేందుకు అవసరమైన శక్తిని పొందుతా. ఈజీగా బౌలింగ్ చేయడంతో పాటు గాయాల పాలవ్వకుండా ఉంటాను' అని కమిన్స్ ఫాక్స్ స్పోర్ట్స్‌తో వెల్లడించాడు. అంతేకాదు ఈసారి బోర్డర్ - గవాస్కర్ ట్రోఫీ గెలవడమే తన లక్ష్యమని అతడు చెప్పాడు.

**భారత్ మంచి జట్టు**

'నేను ఇప్పటివరకూ గెలవని ట్రోఫీ అంటే బోర్డర్ %-% గవాస్కర్. జట్టులోని చాలామంది కూడా ఈ సిరీస్ నెగ్గలే. స్వదేశంలో సిరీస్ గెలిచేందుకు ఎంతో పట్టుదలగా ఉన్నాం. భారత్ మంచి జట్టు. ఇండియాతో మేము చాలా క్రికెట్ ఆడాం. భారత ఆటగాళ్ల గేమ్ మాకు తెలుసు. అయితే.. మేము కూడా గొప్పగా ఆడగలం' అని కమిన్స్ తెలిపాడు. కమిన్స్ నిరుడు జూన్ నుంచి క్రికెట్ ఆడుతూనే ఉన్నాడు. డబ్ల్యూటీసీ ఫైనల్, యాషెస్ సిరీస్, వన్డే వరల్డ్ కప్.. ఆ తర్వాత ఐపీఎల్.. టీ20 ప్రపంచ కప్.. ఇలా వరుసపెట్టి టోర్నీలు ఆడాడు. నవంబర్ 22న బోర్డర్ %-% గవాస్కర్ ట్రోఫీ మొదలవ్వనుంది. 1992 తర్వాత తొలిసారిఐదు టెస్టుల మ్యాచ్‌గా జరుగనుంది.

**బోర్డర్ - గవాస్కర్ ట్రోఫీతో భారత జట్టు**

టెస్టు క్రికెట్‌లో ఆసీస్ ఆధిపత్యానికి భారత్ చెక్ పెట్టింది. 2017 తర్వాత బోర్డర్ %-% గవాస్కర్ ట్రోఫీని కంగారూ జట్టు గెలవలే. వరుసగా నాలుగు పర్యాయాలు భారత్ సిరీస్‌ను సొంతం చేసుకుంది. దాంతో.. ఎలాగైనా సరే ఈసారి బీజీటీని ఒడిసిపట్టాలని కమిన్స్ బృందం పట్టుదలతో ఉంది.

# మా అమ్మ తర్వాత ప్రభాసే



చాలామంది నన్ను చూసి ఏ కొత్త హీరోయినో అనుకుంటారు. కానీ నేను ఇండస్ట్రీకి వచ్చి పదేళ్లు దాటుతోంది. తమిళం, మలయాళం, హిందీలో దాదాపు పది సినిమాల్లో నటించా. నా అభిమాన కథానాయికలు శోభన, ఊర్వశి, కాజోల్, మాధురి దీక్షిత్‌లాగా అందరికీ ఎప్పటికీ గుర్తుండిపోయే పాత్రలు పోషించాలన్నదే నా కోరిక. అందుకే ఆచితూచి సినిమాలను ఎంపిక చేసుకుంటున్నా. రూ. 500 కోట్లు వసూలు చేసే భారీ బడ్జెట్ చిత్రంలో కూడా నా పాత్రకు తగిన ప్రాధాన్యత లేకపోతే నిర్మోహమాటంగా నో చెప్పేస్తా. విజయ్, నేను కలిసి 'బాఘీ -3' సినిమా చూశాం. అందులో టైగర్ ష్రాఫ్ ఎంట్రీ సీన్ రాగానే విజయ్ ఆనందంతో 'తలైవా' అంటూ గట్టిగా అరిచారు. అప్పుడు అర్థమైంది ఆయనకు టైగర్ ష్రాఫ్ అంటే ఎంత ఇష్టమనేది. ఆయన ఏదైన మాట ఇస్తే చాలు.. ఆరు నూరైనా దాన్ని నెరవేర్చుతారు. ఇక ధనుష్, నేను కలిసి 'మారన్' సినిమా చేశాం. దాదాపు మా ఇద్దరి ఆలోచనలు ఒకేలా ఉంటాయి. ధనుష్ యాక్టింగ్‌లో మాస్టర్. ఏ సన్నివేశాన్ని అయినా ఇంకా బాగా ఎలా చేయొచ్చో నాకు సలహాలు ఇస్తుండేవారు. నాకు వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీ అంటే అమితమైన ప్రేమ. షూటింగ్స్ నుంచి కాస్త విరామం దొరికితే చాలు తమిళనాడు, కేరళ, కర్ణాటక పరిసర ప్రాంతాల్లోని అడవుల్లో సరదాగా తిరుగుతూ వన్యప్రాణులను కెమెరాలో బంధిస్తుంటా. ఇటీవల ఆఫ్రికా సందర్శనకు వెళ్లా. అక్కడ టాంజానియాలోని సెరెంగిటి నేషనల్ పార్క్ , కెన్యాలోని మాసాయి మారా నేషనల్ రిజర్వ్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా, ఒక చిరుత జింకపిల్లను వేటాడటాన్ని కళ్లారా చూశా. వెంటనే ఆ చిరుత జింక తలను నోట పట్టి తినడాన్ని నా కెమెరాలో రికార్డు చేశా. 'రాజా సాబ్' షూటింగ్ సమయంలో ప్రభాస్ నాకు ఫుడ్ పంపించారు. మా అమ్మ ఫుడ్ తర్వాత నేను ఇప్పటివరకు తిన్న వాటిలో బెస్ట్ అంటే ప్రభాస్ సర్ పంపించిందే. ఆయన పాన్ వరల్డ్ స్టార్ అయినా సరే.. సెట్‌లో అందరితో చాలా సరదాగా ఉంటారు. ఆయన సింప్లిసిటీకి ఎవరైనా ఆకర్షితులవ్వాల్సిందే. 'తంగలాన్' సినిమా షూటింగ్‌లో నాకు విచిత్రమైన అనుభవం ఎదురైంది. ఒకరోజు నేను సెట్‌కు వెళ్లేసరికి ఓ పెద్ద గేదె ఉంది. డైరెక్టర్ పా.రంజిత్ వచ్చి ఆ గేదెపై ఎక్కగలవా? అని అడిగారు. ఏదో సరదాగా అన్నారనుకున్నా. కానీ మేకప్ పూర్తయిన తర్వాత ఆ గేదెపై కూర్చోమన్నారు. చేసేదేమీ లేక గుండె గుబేలుమంటున్నా సరే ఏదోలా షూట్ పూర్తి చేశా. దాదాపు నాలుగైదు గంటలు మేకప్‌కు వెచ్చించాల్సి వచ్చేది. ఆ మేకప్, టాటూ, కాస్ట్యూమ్, విగ్‌తోనే దాదాపు పది గంటలపాటు ఉండేదాన్ని. పైగా మండే ఎండల్లోనే షూటింగ్ చేశాం. దాంతో నా శరీరమంతా దద్దుర్లు వచ్చేశాయి. రోజూ సెట్స్‌లో డెర్మటాలజిస్ట్, ఐ డాక్టర్... ఇలా ఐదుగురు డాక్టర్లు ఉండేవారు. నా జీవితంలో ఎన్నో మర్చిపోలేని అనుభవాలను మిగిల్చిన సినిమా. మా నాన్న 'మహర్షి' చిత్రానికి పనిచేశారు. ఆ సినిమా చిత్రీకరణ సమయంలో ఓ రోజు నాన్నతో కలిసి షూటింగ్‌కు వెళ్లాను. అక్కడ మహేశ్‌ను కలిసే అవకాశం దక్కింది. ఎంతో ఫ్రెండ్లీగా పలకరించారు. మహేశ్‌తో కలిసి నటించేందుకు ఎదురుచూస్తున్నా. నాకు ఇష్టమైన హీరో ఫహద్ ఫాజిల్.

## సుడిగాలి సుధీర్ 'గోట్' నుంచి సెకండ్ సింగిల్ రిలీజ్



ప్రముఖ హాస్యనటుడు సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం గోట్ దివ్యభారతి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని మహాతేజ క్రియేషన్స్ అండ్ జైష్ణవ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తుంది. ఈ చిత్రానికి చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ళ నిర్మాత. ప్రస్తుతం చిత్రం చిత్రీకరణ దశలో వుంది. కాగా ఇటీవల ఈచిత్రం నుంచి విడుదలైన అయ్యో పాపం సారూ.. అనే ఓ బ్యూటిఫుల్ లిరికల్ వీడియో చార్ట్‌బస్టర్‌గా నిలిచి శ్రోతలను విపరీతంగా ఆకట్టుకుంది. అయితే తాజాగా ఈ చిత్రం నుంచి హీరో ఇంట్రడక్షన్ సాంగ్‌గా.. హీరో క్యారెక్టర్ గురించి చెప్పే 'బాసే హే నీలా వుండే లక్కు మాకే లేదురా.. సెలబ్రిటీ నీకన్న ఎవడురా' అనే లిరికల్ వీడియో సాంగ్‌ను విడుదల చేశారు చిత్ర యూనిట్. ప్రముఖ గీత రచయిత కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటకు లియోన్ జేమ్స్ సంగీతాన్ని అందించారు. హీరో సుధీర్‌పై చిత్రీకరించిన ఈ పాటను ఇటీవల పుష్ప.. పుష్ప.. పుష్పరాజ్ అంటూ పుష్ప-2లోని టైటిల్ సాంగ్‌ని పాడి పాపులరైన దీపక్ బ్లూ ఈ పాటను ఆలపించడం విశేషం. కొరియోగ్రాఫర్ జీతు మాస్టర్ ఈ పాటకు డ్యాన్స్ మూమెంట్స్‌ను అందించారు. వినసొంపైన బాణీలతో, క్యాచీ పదాలతో అందర్ని ఆకట్టుకునే విధంగా వుంది. ఈ సినిమా గురించి నిర్మాత మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఎనభై శాతం షూటింగ్ పూర్తయింది. టాకీ పార్ట్ దాదాపు పూర్తిచేసుకున్నాం. యాక్షన్ ఎపిసోడ్స్, రెండు పాటల చిత్రీకరణ బ్యాలెన్స్ వుంది. త్వరలో వాటిని కూడా చిత్రీకరిస్తాం. టెక్నికల్‌గా కూడా చిత్రం ఉన్నతస్థాయిలో వుంటుంది. అన్నారు.

## ప్రభాస్ కోసం కొత్త బ్యూటీ..



'సలార్', 'కల్కి' వంటి బ్లాక్ బస్టర్ సినిమాలతో జోష్ మీదున్న ప్రభాస్ తాజాగా మరో సినిమాను ప్రారంభించిన విషయం తెలిసిందే. సీతారామం, అందాల రాక్షసి చిత్రాల ఫేమ్ హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ తన నెక్స్ట్ ప్రాజెక్ట్‌ను చేయబోతున్నాడు. వార్ బ్యాక్‌డ్రాప్‌లో ఫ్రీ ఇండిపెండెన్స్ కథతో ఈ సినిమా రాబోతుంది. అయితే ఈ సినిమాలో కొత్త హీరోయిన్‌ను ఇండస్ట్రీకి తీసుకురాబోతున్నాడు హను రాఘవపూడి. ఇప్పటికే సీతారామం సినిమాతో మృణాల్ ఠాకుర్‌ను టాలీవుడ్‌కు పరిచయం చేసిన హను తాజాగా (ఇమాన్ ఎస్మాయిల్) ఇమాన్వీ అనే భామను పరిచయం చేయబోతున్నాడు. ప్రభాస్‌కు జోడిగా ఇమాన్ ఎస్మాయిల్ నటిస్తుండటంతో ఆమె ఎవరు అని ప్రభాస్ అభిమానులతో పాటు నెటిజన్లు తెగ వెతుకుతున్నారు. పాకిస్థాన్ మూలాలు ఉన్న ఈ భామ దేశ రాజధాని ఢిల్లీలో సెటిల్ అయింది. ఇమాన్వీ మంచి డ్యాన్సర్ కూడా. ఆమె చేసిన ఒక వీడియో అప్పట్లో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యింది. అయితే ఇమాన్వీ నటనను చూసి హను ఎంపిక చేసినట్లు తెలుస్తుంది. సుభాష్ చంద్రబోస్ పాలనలో జరిగే పీరియాడికల్ డ్రామా, అని ఈ ప్రేమకథలో ప్రభాస్ ఆర్మీ మేన్‌గా కనిపించనున్నాడని అంటున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని భారీ ఎత్తున నిర్మించనున్నారు. ఇందుకోసం రామోజీ ఫిల్మ్ సిటీలో భారీ సెట్‌ను కూడా నిర్మిస్తున్నారు. ఈ సెట్‌లోనే ఎక్కువ భాగం షూటింగ్ జరగనుంది. సీనియర్ నటులు మిథున్ చక్రవర్తి, జయప్రద కీలక పాత్రల్లో నటించనున్నారు. ఈ చిత్రానికి కెమెరా: సుధీప్ ఛటర్జీ, సంగీతం: విశాల్‌చంద్రశేఖర్, ప్రొడక్షన్ డిజైనర్: రామకృష్ణ-మోనిక, వీఎఫ్ఎక్స్: కమల్ కన్నన్, రచన-దర్శకత్వం: హను రాఘవపూడి.



## అలాంటి వారితో స్నేహం ఎలా చేయగలను?

బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ కంగనా రనౌత్ ఏ విషయాన్నైనా నిర్మొహమాటంగా చెబుతుంటారు. ఎన్నో సందర్భాల్లో బాలీవుడ్‌పై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆమె తాజా ఇంటర్వ్యూలోనూ ఆ చిత్ర పరిశ్రమపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. బాలీవుడ్‌లో మీకు ఫ్రెండ్స్ ఉన్నారా? అనే ప్రశ్నకు సమాధానమిస్తూ.. "నేను బాలీవుడ్‌కు సెట్ అయ్యే వ్యక్తిని కాదు. అందుకే నాకు ఇక్కడ స్నేహితులు లేరు. వాళ్లందరి లైఫ్ స్టైల్ వేరు. నాది వేరు. షూటింగ్స్ లేకపోతే.. ఉదయం జిమ్ చేయడం, మధ్యాహ్నం నిద్రపోవడం, మళ్లీ సాయంత్రం కసరత్తులు చేయడం, టీవీ చూడడం, పడుకోవడం ఇదే వారి దినచర్య. అంతకుమించి వారికేం తెలియదు. అలాంటి వారితో స్నేహం ఎలా చేయగలను? సమాజంలో ఏం జరుగుతుందో పట్టించుకోరు. ఎప్పుడూ వాళ్ల దుస్తులు, విలువైన వస్తువుల గురించే మాట్లాడుకుంటుంటారు తప్ప మరో విషయాన్ని పట్టించుకోరు. వీటికి భిన్నంగా ఆలోచించే వ్యక్తి బాలీవుడ్‌లో కనిపిస్తే ఆశ్చర్యమే" అని వ్యాఖ్యానించారు. ఇండస్ట్రీలో జరిగే పార్టీ గురించి మాట్లాడుతూ.. అక్కడ వారు మాట్లాడుకునే మాటలు నాకు చాలా ఇబ్బంది కలిగిస్తాయి. నా కోణంలో బాలీవుడ్ పార్టీలంటే 'ఓ ట్రామా' అని అన్నారు. ఇక కంగనా సినిమాల విషయానికొస్తే.. త్వరలోనే 'ఎమర్జెన్సీ'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు కంగనా. ఆమె ప్రధాన పాత్రలో స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రమిది. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ రాజకీయ జీవితం ఆధారంగా రానున్న ఈ సినిమా సెప్టెంబరు 6న విడుదల కానుంది.




## నటన రాకుంటే అంతటితో ఆగిపోయేదాన్ని!

అనన్య పాండేకి పెద్దగా హిట్స్ లేవు. అయినా సరే ఈ సినిమా నేపథ్యమున్న ఈ బాలీవుడ్ భామ ఎక్కడా తగ్గట్లేదు. ముఖ్యంగా ఆమెకి సోషల్ మీడియాలో ఉండే హవా అంతా ఇంతా కాదు. రెండున్నర కోట్ల మంది ఆమెను ఫాలో అవుతున్నారు. చిన్ననాటి ఫొటోలనుంచి.. ఎండోర్స్‌మెంట్స్ విశేషాలు, ప్రయాణాలు, వ్యక్తిగత జీవితాన్ని ఇన్‌స్టాలో షేర్ చేస్తుంటుంది. బాలీవుడ్ కథానాయికగానే ట్యాగ్ వేసుకోవటానికి ఆమె ఇష్టపడుతుంది. అనన్యపాండే తండ్రి నటుడు. ఇక తల్లి భావన ఎంటర్‌ప్రూనర్. 'ఏ రిలేషన్‌షిప్ అయినా నిలబడాలంటే వారి మధ్య స్నేహం ఉండాలి. అమ్మానాన్నలను చూస్తే ప్రేమ, పెళ్లి గొప్పతనం అర్థం అవుతుంది. మా అమ్మమ్మ,తాతయ్య.. ఇలా పెద్దవారి నుంచి ఎలా ఉండాలో నేర్చుకున్నా. వారిదగ్గరే స్ట్రాంగ్ మెంటాలిటీ ఏర్పడింది. నా చెల్లెలు రైసాతో చిన్నప్పుడు భలే గొడవపడేదాన్ని. ఇప్పుడు తనే మంచి స్నేహితురాలైంది. స్టార్స్‌కి చప్పట్లు కొట్టేవాళ్లెక్కువ. నిజమైన విషయాలు తెలీవు. నా చెల్లెలు మొఖం మీదనే చెబుతుంది. ఇకపోతే అమ్మానాన్న కూడా అంతే. చిన్నప్పటి నుంచి ఒకేలా పెంచారు మా ఇద్దరినీ. ఏదైనా సినిమా బాగలేకున్నా మా పేరెంట్స్ క్రిటిక్స్ అవతారమెత్తుతారు. నేను యాక్టింగ్‌లో ప్రూవ్ చేసుకుంటే ప్రశంసిస్తారు. ఇట్లాంటి వాతావరణంలో ఉన్నా కాబట్టే హాయిగా ఉన్నా. 'నాలుగేళ్ల వయసులో ధీరుభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చేర్పించారు. సుహానా ఖాన్(షారుఖ్ ఖాన్ కూతురు), షనయా కపూర్(సంజయ్ కపూర్ కూతురు).. నా స్నేహితులే. వారితో కలిసి చదివా. మేం ఆరుమంది గ్యాంగ్. ఇప్పటికీ స్కూల్‌మేట్స్ నా స్నేహితులు. వారి దగ్గర పాపులర్ హీరోయిన్ అనే గర్వం నాకుండదు. నేను హీరోయిన్ అని వారు గర్వంగా చెబుతారు. ఇప్పటికీ ఆ స్నేహం అలాగే కొనసాగుతోంది. కొత్తగా ఉండటం.. కొత్త విషయాలు తెలుసుకోవడం ఇష్టం. ఫ్యాషన్ వాల్డ్ అంటే పిచ్చి. ఒకసారి ఇటలీలో ఫ్యాషన్ షూట్‌కు వెళ్లాను. ఆ షూట్‌లో పాస్తా బాగా లాగించేదాన్ని. అప్పుడే కరణ్ జోహార్ గారి నుంచి పిలుపొచ్చింది. ఆ చిత్రమే 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2'. సినిమా నేపథ్యం ఉండటం వల్ల ఈ అవకాశం వచ్చింది. అయితే నటన రాకుంటే అంతటితో ఆగిపోయేదాన్ని కదా! ప్రతిభ ఉందని అవకాశం ఇచ్చారు. అలా తొలి చిత్రానికే ఫిల్మ్‌ఫేర్‌లో బెస్ట్ ఫిమేల్ డెబ్యూట్ అవార్డు వచ్చింది. ఇక్కడ సినిమా బ్యాక్‌గ్రౌండ్ లాంచింగ్‌కే ఉపయోగపడుతుంది. ఆ తర్వాత పని చేయాల్సిందే' అంటుంది అనన్య.

PMR Publication,Thurkayamjal 4-136/12, 9100900918